# క్రైమ్ THE మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
10-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 200

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## ఇండియా కూటమిలోకి
# బిఆర్ఎస్!

తెలంగాణ సీఎం రేవంత్‌ను పక్కన పెడితే..

కేటీఆర్ సరికొత్త గేమ్

గత అనుభవాల దృష్ట్యా నమ్మని కాంగ్రెస్ హై కమాండ్



గులాబీ పార్టీ కాంగ్రెస్ కు దగ్గర అవుతోందా? ఆ మేరకు కేటీఆర్ సంకేతాలు పంపుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీని, గాంధీభవన్ సంస్కృతిని తీవ్రంగా నిందించేవారు కేటీఆర్. ఇప్పుడు వ్యూహాత్మకంగా రేవంత్ రెడ్డిని మాత్రమే టార్గెట్ చేస్తూ.. రాహుల్ గాంధీకి పదే పదే ఫిర్యాదులు చేస్తున్నారు.

- మిగతా 3వ పేజీలో




## ఏపీ ప్రభుత్వానికి
# షాక్!

బీసీ రిజర్వేషన్లు 34 శాతం సాధ్యం కాదని తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు

హైకోర్టు తీర్పునకు సమర్ధన

పార్టీ పరంగా అమలు చేసేందుకు టిడిపి నిర్ణయం




**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం అవుతోంది. సుప్రీంకోర్టులో రిజర్వేషన్లకు సంబంధించిన తీర్పు వెల్లడయింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన 34 శాతం రిజర్వేషన్ల జీవోను కొట్టివేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది

మిగతా 2లో

## అమెరికాలో ములకనూరు బియ్యం!



కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

తెలంగాణ సోనా, జైశ్రీరామ్ రకాల బియ్యం ఎగుమతికి మార్గం సుగమం

సుదీర్ఘ చరిత్ర ఈ సహకార సొసైటీ సొంతం

మిగతా 2లో



## రాజ్యసభకు లతా రజనీకాంత్!

ఢిల్లీలో గట్టి ప్రయత్నాలు రజనీకాంత్ భార్య

కేంద్ర మంత్రులతో వరుసగా చర్చలు

జాతీయస్థాయిలో ఉనికి కోసం ఆరాటం

# జెన్ జీ ఎక్కడ?!

## కాక్రోచ్ ఉద్యమం వెనుక రాజకీయ పార్టీలు

బెంగళూరు సభలో లెఫ్ట్, ఆప్ రెగ్యులర్ యువ కార్యకర్తలు

ప్రకాష్ రాజ్, యూట్యూబర్ ధృవ్ లాఠీతోనే

దేశవ్యాప్తంగా ఉప్పెనలా మారింది జనతా కాక్రోచ్ ఉద్యమం. యువతరం గొంతుకను, సామాజిక మార్పు కోసం అంటూ సోషల్ మీడియా వేదికగా భారీ హడావిడి నడిచింది. నూతన తరానికి ప్రతినిధులు అంటూ.. జెన్ జీ ఆశయాలకు వారసులం అంటూ ఎన్నో రీల్స్, వీడియోలతో హల్ చల్ చేసింది ఈ వర్గం.




మిగతా 2లో

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ :** తమకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని చెబుతూ.. దేశవ్యాప్తంగా బిజెపికి వ్యతిరేకంగా యువతను మేలుకొలుపుతూ.. యువత ప్రాతినిధ్యం పెరగాలని కోరుతూ పెద్ద ఉద్యమమే ఊపందుకుంది. కానీ ఈ కాక్రోచ్ ఉద్యమం వెనుక పూర్తిగా రాజకీయ పార్టీలు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో.. బెంగళూరులో జరిగిన ప్రదర్శనలతో ఇది స్పష్టమైంది. ఇప్పటివరకు ఆమ్ ఆద్మీ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీల రాజకీయ భావజాలానికి కట్టుబడి పనిచేస్తున్నట్లు స్పష్టమైంది. కేవలం సోషల్ మీడియాలో వైరల్ వ్యూస్ కోసం యువతను ఆకర్షించిన వీరు.. చివరికి వివాదాస్పద నటుడు ప్రకాష్ రాజ్, యూట్యూబర్ ధృవ్ రాఠీ లాంటి అజెండా రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం పావులుగా మారుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



## వైసీపీలో నెల్లూరు
# చిచ్చు!

రిజర్వేషన్లు ఖరారు కాకుండానే మేయర్ అభ్యర్ధి ప్రకటన

ఏకపక్షంగా ప్రకటించారంటూ మిగతా ఆశావహుల ఆవేదన

అధిష్టానానికి వరుసగా ఫిర్యాదులు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొత్త రచ్చ ప్రారంభం అయింది. ఏకపక్షంగా నెల్లూరు



## హుస్సేన్ సాగర్ టు ప్రకాశం బ్యారేజీ!

త్వరలో అందుబాటులోకి సీ ప్లేన్లు

45 నిమిషాల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు

రెండు రాష్ట్రాల మధ్య పట్టాలెక్కనున్న పర్యాటక ప్రాజెక్ట్

క్రైమ్ మిర్రర్, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాలకు గుడ్ న్యూస్. త్వరలో ఒక పర్యాటక ప్రాజెక్టు ప్రారంభం కానుంది.

మిగతా 3లో

## అకున్ సబర్వాల్‌కు పోస్టింగ్ కష్టమే!

కేంద్ర సర్వీసుల్లో పూర్తయిన డిప్యూటేషన్

తిరిగి తెలంగాణ క్యాడర్‌లోకి..

కీలక పోస్టింగ్ దక్కే ఛాన్స్ లేదు



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** సీనియర్ ఐపీఎస్ అధికారి అకున్ సబర్వాల్ చుట్టూ సరికొత్త చర్చ మొదలైంది. కేంద్ర సర్వీసుల్లో డిప్యూటేషన్ పూర్తిచేసుకుని తెలంగాణ క్యాడర్ కు ఆయన ఇటీవల తిరిగి వచ్చారు. గతంలో గులాబీ పార్టీ హయాంలో

మిగతా 2లో



## ఏపీకి దళపతి విజయ్!

విజయవాడ దసరా ఉత్సవాలకు హాజరు

తెలుగు రాష్ట్రాల్లో పార్టీ విస్తరించాలన్న ఆలోచన

అందుకే సానుకూలత వ్యక్తం చేసిన తమిళనాడు సీఎం

మిగతా 2లో

## జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు
# నెలలోపు పరిష్కారం

జీఓ 59 పెండింగ్ దరఖాస్తులపై మంత్రి పొంగులేటి ప్రకటన..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ అమలులో భాగంగా ఈ నిర్ణయమని వెల్లడి

500 చదరపు గజాల లోపు స్థలాల దరఖాస్తులకు పరిష్కారం

పెండింగ్ ఫైళ్లపై ప్రభుత్వం ప్రత్యేక మెమో జారీ

గతంలో ఇచ్చిన కన్వేయన్స్ డీడ్‌లపైనా సమీక్ష

22-ఏ జాబితాలోని అనుమతులు పొందిన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు మార్గం

మిగతా 3లో







# వైసీపీలో నెల్లూరు చిచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్ కుమార్ రెడ్డి పేరు ప్రకటించడం పై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అసంతృప్తి జ్వాలలు భగ్గుమంటున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నెల్లూరు నగర కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా విజయ్ కుమార్ రెడ్డి పేరు ప్రకటించారు జగన్. అసలు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే.. కనీసం ఏ స్థానానికి ఏ రిజర్వేషన్ వర్తిస్తుందో ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేయకముందే.. అభ్యర్థిని ప్రకటించడం ఏంటనే ప్రశ్న సొంత పార్టీలోనే వినిపిస్తోంది. కనీస నిబంధనలు, ఎన్నికల ప్రక్రియపై ప్రాథమిక అవగాహన కూడా లేని నేతగా జగన్ పై సొంత క్యాడర్ కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. నెల్లూరు మేయర్ అభ్యర్థి విషయంలో తాడేపల్లి ప్యాలెస్ లో కోటరీ పైన ఎక్కువగా ఆరోపణలు వస్తున్నాయి.

**తారాస్థాయిలో విభేదాలు..**

నెల్లూరు జిల్లాలో నేతల మధ్య విభేదాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే నాయకుల మధ్య సమన్వయం లేదు. ఇప్పుడు ఏకపక్షంగా ఆనం విజయ్ కుమార్ రెడ్డి పేరు ప్రకటించడం పై పెద్ద ఎత్తున గొడవ ప్రారంభం అయింది. నెల్లూరు నగరంలో పార్టీ వ్యవహారాలను నడిపిస్తున్న నియోజకవర్గ ఇన్చార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వర్గం ఈ పరిణామంతో తీవ్ర అసంతృప్తికి లోనైనట్లు తెలుస్తోంది. స్థానిక నేతలతో సమగ్రమైన సంప్రదింపులు జరపకుండా.. గ్రౌండ్ రియాలిటీ ని పరిగణలోకి తీసుకోకుండా.. కేవలం తాడేపల్లిలోని కొందరు ముఖ్యుల ఒత్తిడి మేరకే ఈ ప్రకటన చేశారన్న భావన స్థానిక నాయకుల్లో బలంగా పాతుకు పోయింది. దీంతో జిల్లాలో పార్టీ ఐక్యతకు గండిపడటమే కాకుండా.. రానున్న ఎన్నికల్లో వర్గ పోరు ప్రభావం ఫలితాలపై పడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు ఆందోళనతో ఉన్నాయి.

**ఆ ఒక్క స్థానం ప్రకటనపై..**

రాష్ట్రవ్యాప్తంగా 12 కార్పొరేషన్ల వరకు ఉన్నాయి. ఇంకా వాటికి రిజర్వేషన్లు ఖరారు కాలేదు. అటువంటిది నెల్లూరు సీట్ పై ఇప్పుడు హఠాత్తుగా పేరు ప్రకటన ఏంటనే ప్రశ్న వినిపిస్తోంది. ఒకవేళ నెల్లూరు మేయర్ పదవి బీసీలకు కానీ.. ఎస్సీలకు కానీ రిజర్వ్ అయితే పరిస్థితి ఏంటనే ప్రశ్నా వినిపిస్తోంది. కేవలం తాడేపల్లి ప్యాలెస్ లో కొంతమంది నేతల తీరు వల్లే ఈ పరిస్థితి అని సొంత పార్టీ క్యాడర్ విమర్శిస్తోంది. ఒక్క నెల్లూరుకు ఇప్పుడు అభ్యర్థి ప్రకటించడంతో మిగతా నగరాల్లో ఆశావహులు ఒత్తిడి చేయడం ప్రారంభించారు. పార్టీ అంతర్గత సమావేశాల్లో అధినేత జగన్ సైతం కోటరీ నేతల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయకుండా.. అనాలోచితంగా సలహాలు ఇస్తూ.. ఒక సమస్యను పరిష్కరించబోయి.. 100 సమస్యలను సృష్టిస్తున్నారంటూ కొందరు ముఖ్య నేతలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. మొత్తానికైతే నెల్లూరు మేయర్ అభ్యర్థి ప్రకటన.. వైసీపీలో కొత్త ప్రకంపనలు రేపుతోంది..

# అమెరికాలో ములకనూరు బియ్యం!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** వ్యవసాయ ఉత్పత్తుల్లో తెలంగాణ మరోసారి అంతర్జాతీయ ఖ్యాతి సొంతం చేసుకుంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములకనూర్ సహకార సొసైటీ ఇప్పుడు అరుదైన ఘనతను దక్కించుకుంది. ములకనూరు సహకార సొసైటీ బియ్యం ఇప్పుడు అమెరికా వరకు చేరనుంది. తెలంగాణ సోనా, జైశ్రీరామ్ రకాల బియ్యం ఎగుమతికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 15 సంవత్సరాలుగా బ్రాండింగ్ చేసి అమ్ముతున్న ఈ సొసైటీ ద్వారా.. రాష్ట్రవ్యాప్తంగా 51 కేంద్రాల ద్వారా ఏటా 25 కోట్ల రూపాయల విలువైన బియ్యం విక్రయిస్తోంది. స్థానికంగా జైశ్రీరామ్ కిలో 80 రూపాయలు కాగా.. తెలంగాణ సోనా 70 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఇవే బియ్యం అమెరికాలో కిలో 200 రూపాయల వరకు ధర పలికే అవకాశం ఉంది.

**సేంద్రీయ సాగు విధానంతో..**

పూర్తిగా సేంద్రియ విధానంలో సాగు చేసే ధాన్యం ద్వారా ఈ బియ్యాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. క్రిమిసంహారక మందులు వాడని నాణ్యమైన బియ్యం కావడంతో ప్రవాస తెలుగువారు ములకనూరు సహకార సొసైటీ బియ్యాన్ని ఎక్కువగా కోరుకుంటున్నారు. ఆ సొసైటీ అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి నేతృత్వంలో అమెరికా సంస్థ హార్వెస్ట్ లింక్ తో ఒప్పందం జరిగింది. విశాఖపట్నం పోర్టు ద్వారా మొదటి విడతగా 25 టన్నుల బియ్యాన్ని పంపాలని నిర్ణయించారు. కంటైనర్ అనుమతి రాగానే రెండు నెలల్లో ఎగుమతి మొదలవుతుంది. ఏటా 100 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ప్రవాస తెలుగు వారి కోరికతో..**

ముల్కనూరు బియ్యానికి తెలుగు రాష్ట్రాల్లో మంచి బ్రాండ్ ఉంది. ఇప్పుడు విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలు



ఎక్కువగా ఈ బ్రాండ్ బియ్యం కోరుతుండడంతో అంతర్జాతీయ మార్కెట్లోకి అడుగుపెట్టడం తెలంగాణ రైతులకు కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. సహకార రంగానికి ఇది ఒక ఊపు. నాణ్యత, బ్రాండింగ్, ఎగుమతి అనుమతులు కలిసి వస్తే తెలంగాణ బియ్యం ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందే అవకాశం ఉంది. అదే జరిగితే రైతులకు సైతం ఎంతో మేలు జరిగినట్టే.

**దాదాపు ఏడు దశాబ్దాల కిందట..**

కాగా ములకనూరు సహకార సొసైటీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. 1956లో దివంగత కలిగిరెడ్డి కాశీ విశ్వనాథరెడ్డి నేతృత్వంలో.. కేవలం 373 మంది సభ్యులు.. 200300 రూపాయల వాటా ధనంతో ఈ సొసైటీ ప్రారంభం అయింది. తొలి 14 సంవత్సరాలు ఆయన ఇంటి నుంచి నడిచింది. ప్రస్తుతం 14 గ్రామాల్లో 7వేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. 150 మంది సిబ్బందితో నడుస్తోంది. వేట నాలుగు వందల కోట్ల రూపాయలకు పైగా వ్యాపారం చేస్తూ.. దాదాపు 0 ఎంపీలతో రికవరీ రేటు చాలా ఎక్కువగా ఉంది. రైతులకు పంట రుణాలు, విత్తనాలు, నిల్వ సౌకర్యాలు, బోనస్, వృద్ధాప్య పింఛన్ వంటి సేవలు కూడా అందిస్తోంది. అంతర్జాతీయ బ్రాండ్ లభిస్తుండటంతో ఈ సొసైటీ సేవలు మరింత విస్తృతం అయ్యే అవకాశం ఉంది.

# జెన్ జీ ఎక్కడ?!

**అక్కడ కనిపించింది వారే..**



తాజాగా బెంగళూరులో ఓ నిరసన కార్యక్రమం జరిగింది. జెన్ జీ పేరుతో భారీ ఉద్యమం చేస్తున్నట్లు చెప్పుకున్న ఈ సభలో పాల్గొన్న వారంతా కేవలం లెఫ్ట్, ఆప్ పార్టీలకు చెందిన రెగ్యులర్ యువ కార్యకర్తలు. అసలైన జనరేషన్ జెడ్ యువత ఎక్కడా కనిపించలేదు. సోషల్ మీడియాలో హైప్ క్రియేట్ చేసి అమాయక విద్యార్థులను, యువతను నోటెడ్ పొలిటికల్ ప్రాపగండా కోసమే వాడుకుంటున్నారనే వాస్తవం వెలుగులోకి వచ్చింది. ఎవరికోసం అయితే ఈ పోరాటాలు చేస్తున్నామని చెప్పుకుంటున్నారో.. మా కంటెంట్ అంతా నిర్దిష్టమైన కొన్ని రాజకీయ శక్తులకు అనుకూలంగా ఉంటుంది. మోడీపై వ్యక్తిగత విమర్శలు చేయడం ఫ్యాషన్ గా మారింది.

**స్వతంత్ర ఆలోచనలతో..**

బెంగళూరులో జరిగిన కార్యక్రమం వెనుక నటుడు ప్రకాష్ రాజ్, సోషల్ మీడియాలో ఒక వర్గాన్ని బ్రెయిన్ వాష్ చేస్తే ధ్రువ్ లాఠీ ఉన్నారు అనేది బహిరంగ రహస్యం. స్వతంత్ర ఆలోచనలతో ముందుకు వస్తున్నట్లు నటిస్తూనే.. తెర వెనుక కమ్యూనిస్ట్, ఆపు భావజాల నేతల స్క్రిప్టులను అమలు చేయడం వీళ్ళ అసలు పని అని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. తాము కేవలం ఒక వర్గం రాజకీయ ప్రయోజనాల కోసం.. కొన్ని ప్రత్యేక ప్రయోజనాలు ఉన్న వ్యక్తుల డైరెక్షన్లో పనిచేసే అనుబంధ సంఘంగా మారిపోయామని.. మీరు తమ చర్యల ద్వారా రుజువు చేసుకుంటున్నారు. తమ స్వార్ధ రాజకీయ అజెండాను అమలు చేసేందుకు యువతను.. జెన్ జీ ట్రెండ్స్ ను కేవలం వస్తువులుగా వాడుకుంటున్న ఈ కాక్రోచ్ గ్యాంగ్ మోసాలను.. దేశంలోని యువత ఇప్పుడిప్పుడే పసిగడుతోంది. కేవలం సోషల్ మీడియా రీల్స్, డిజిటల్ స్టంట్ ల ద్వారా జనాలకు ఎక్కువ కాలం మధ్య పెట్టలేరని క్లారిటీ వస్తోంది. వీరి తీరుపై విమర్శలు కూడా పెరుగుతున్నాయి.

# అకున్ సబర్వాల్‌కు పోస్టింగ్ కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

ఎక్సైజ్ అండ్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ గా పని చేశారు. ఆ సమయంలోనే టాలీవుడ్ ప్రముఖుల ను వరుసగా విచారించి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. అప్పట్లో ఆయన పేరు మార్మోగిపోయింది. అయితే కేంద్ర సర్వీసుల్లోకి డిప్యూటేషన్ పై వెళ్లిపోయారు. ఇప్పుడు ఆయన తెలంగాణ క్యాడర్ కు తిరిగి రావడంతో డ్రగ్స్ కేసుల ఫైళ్లు మళ్లీ తెరుచుకుంటాయని.. పాత దర్యాప్తు తెర పైకి వస్తుందని కొందరు భావిస్తున్నారు. కానీ అందుకు భిన్న పరిస్థితులు ఉన్నాయి. అప్పట్లో ఆ కేసులను అర్ధాంతరంగా వదిలేసి ఆయన కేంద్ర సర్వీస్లకు వెళ్లడం, సరైన ప్రాసిక్యూషన్ ఆధారాలు లేకపోవడంతో కోర్టులు కూడా నిందితులను నిర్దోషులుగా విడుదల చేయడం జరిగిపోయింది. న్యాయపరంగా మూతపడిన ఆ అధ్యాయాన్ని మళ్లీ తెరిచే అవకాశాలు లేవనేది బహిరంగ రహస్యం.

**లి ప్రాధాన్య పోస్టుకు అవకాశం లేదు..**

ప్రస్తుత ప్రభుత్వంలో అకున్ సబర్వాల్ కు ప్రాధాన్యత కలిగిన పోస్ట్ దక్కే అవకాశం లేదనేది ఒక వాదన. ఆకున్ సబర్వాల్ సతీమణి, సీనియర్ ఐపీఎస్ అధికారిణి స్మిత సబర్వాల్ గత కెసిఆర్ ప్రభుత్వంలో అత్యంత శక్తివంతమైన ఆఫీసర్ గా చక్రం తిప్పారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఉంటూ పదేళ్లపాటు గులాబీ పార్టీ పాలనలో.. కీలక నిర్ణయాలను ప్రభావితం చేసిన ముద్ర ఆమెపై ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమె ఈ ప్రభుత్వంతో కలిసి పని చేయలేకపోయారు. కీలక బాధ్యతలు ఇచ్చిన నెరవేర్చలేకపోయారు. కంచ గచ్చిబౌలి వ్యవహారంలో ప్రభుత్వంపై విమర్శలు చేసి ఉండలేక సెలవు పై వెళ్ళిపోయారు.



**గులాబీ పార్టీతో సంబంధాలు..**

స్మిత సబర్వాల్ కు గులాబీ పార్టీ ప్రభుత్వంతో.. అప్పటి ప్రభుత్వ పెద్దలతో మంచి సంబంధాలు ఉన్నాయి. అటువంటి ఆమె భర్తకు రేవంత్ సర్కార్లో అత్యంత కీలకమైన శాంతిభద్రతల బాధ్యతలు గానీ.. పవర్ఫుల్ అండ్ ఫోర్స్ మెంట్ విభాగాన్ని గాని అప్పగిస్తుందని భావించడం అత్యాశ అవుతుంది. రేవంత్ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి గత ప్రభుత్వ కోటరీ లో ఉన్న అధికారులను పక్కన పెడుతూ వస్తోంది. పైగా డ్రగ్స్ నిర్మూలన కోసం కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికే టీజీ న్యాబ్ వంటి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి.. కొత్త అధికారులతో దూకుడుగా వ్యవహరిస్తోంది. బ్యూరోక్రసీ వ్యవస్థలో ఏ ప్రభుత్వం వస్తే ఆ ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవడం అనేది సర్వసాధారణం. కానీ కాంగ్రెస్ పార్టీ వైఖరి మాత్రం అత్యంత స్పష్టంగా ఉంది. గత పాలకులతో అత్యంత సన్నిహితంగా మెలిగిన వారికి కీలక పోస్టుల్లో ఉండకుండా చేయాలన్నది ఒక వ్యూహంగా కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు అకున్ సబర్వాల్ కు అప్రాధాన్య పోస్టులోనే నియమిస్తారని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# రాజ్యసభకు లతా రజనీకాంత్!

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ :** తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ కు రాజ్యసభ పదవి దక్కనుందా? ఈ మేరకు ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయా? సూపర్ స్టార్ రజనీకాంత్ భార్య లతా ఇప్పుడు ఢిల్లీలో అదే పనిపై ఉన్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తమిళనాడులో విజయ్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్కడి రాజకీయాలు అంతుచిక్కని విధంగా తయారయ్యాయి. ఓటర్ల పల్స్ పట్టడం కష్టతరంగా మారుతుంది. ఎప్పటికప్పుడు పొలిటికల్ సీన్స్ మారుతూ వస్తు న్నాయి. అనూష మార్పులు చోటు చేసుకుంటు న్నా యి. అక్కడి రాజకీయాల అంతా సినిమాస్టార్లు, వారి కుటుంబ సభ్యుల చుట్టే తిరుగుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఇప్పుడు సూపర్ స్టార్ రజనీకాంత్, లేకుంటే ఆయన భార్య లతా రజనీకాంత్ కు రాజ్యసభ పదవి దక్కడం ఖాయమన్న ప్రచారం పొలిటికల్ వర్గాల్లో ప్రారంభం అయింది.

**తరచూ ఢిల్లీలో..**

గత కొద్దిరోజులుగా లతా రజనీకాంత్ ఢిల్లీలో తరచూ కనిపిస్తున్నారు. రాజ్యసభ పదవి దక్కించుకోవడమే ఆమె లక్ష్యంగా కనిపిస్తోందన్న ప్రచారం జరుగుతోంది. తనకు అవకాశం లభించకపోతే రజనీకాంత్ ను రాజ్యసభకు నామినేట్ చేసేలా బిజెపి అధిష్టానాన్ని ఒప్పించడానికి ఆమె రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటనలో భాగంగా లతా రజనీకాంత్ కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, రాజ్ నాథ్ సింగ్లతో పాటు బిజెపి అగ్రనేతలను స్వయంగా కలిసినట్లు తెలుస్తోంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కూడా కలిసి తన ప్రతిపాదనను వివరించేందుకు ఆమె గట్టి ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం.

**పాలిటిక్స్ లోకి వచ్చినట్టే వచ్చి..**

రజనీకాంత్ రాజకీయాల్లోకి వచ్చినట్టే వచ్చి మళ్లీ వెనక్కి వెళ్లిపోయారు. విజయ్ కంటే రజనీకాంత్ ముందు రాజకీయాల్లోకి వచ్చి ఉంటే తప్పకుండా ముఖ్యమంత్రి అయి ఉండేవారు. కానీ ఆయన మళ్లీ తిరిగి వెనక్కి వెళ్ళిపోయారు. మరోవైపు రజనీకాంత్ కు సమకాలీకుడు కమల్ హాసన్ డీఎంకే మద్దతుతో రాజ్యసభకు వెళ్లారు. ఆయన సైతం సొంత పార్టీని స్థాపించి అనుకున్న ఆదరణ దక్కించుకోలేదు. అందుకే ఆయన డిఎంకేకు మద్దతు ప్రకటించి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. అయితే జాతీయస్థాయిలో ఉనికి చాటుకోవాలంటే రాజ్యసభ లాంటి పదవి ఉండాలని లతా రజనీకాంత్ భావిస్తున్నారు. అందుకే ఆమె రాజ్యసభ పదవి కోసం గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. విజయ్ అధికారంలోకి వచ్చిన కొత్తలో లతా రజనీకాంత్ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. సూపర్ స్టార్ రజనీకాంత్ భార్యగా లతా రజనీకాంత్ సుపరిచితురాలు. తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు పొందారు. అయితే ఇప్పుడు రజనీకాంత్ కంటే లతా రజనీకాంత్ కు రాజ్యసభ పదవి వచ్చే అవకాశం ఉన్నట్లు తమిళనాడు పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# ఏపీకి దళపతి విజయ్!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డిస్క్ :** తమిళనాడు సీఎం విజయ్ ఏపీ పర్యటనకు వచ్చే అవకాశం ఉంది. విజయవాడలో అత్యంత వైభవంగా జరిగే ప్రసిద్ధ ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు విజయ్ కు ప్రత్యేక ఆహ్వానం అందింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ నేతృత్వంలోని బృందం ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఎంపీ బృందం ఆహ్వానానికి విజయ్ కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. దసరా వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ బృందం వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, కేంద్ర మంత్రులకు ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్న సంగతి తెలిసిందే.

**కొద్ది నెలల కిందట బాధ్యతలు..**

కొద్ది నెలల కిందట తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టారు విజయ్. ఇబ్బందులను అధిగమించి రాజకీయంగా రాటు తేలుతున్నారు. ఇటీవల కాలంలో విజయ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై, ఇక్కడి సామాజిక పరిస్థితులపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తన పార్టీ భావజాలాన్ని, తమిళనాడు ప్రభుత్వ విజయాలను కేవలం సొంత రాష్ట్రానికి పరిమితం చేయకుండా.. తెలుగు ప్రజలకు కూడా చేరేలా ప్రత్యేకంగా తెలుగులో ప్రకటనలు ఇప్పిస్తున్నారు. టీవీ ఛానళ్లలో సైతం ప్రచారం చేయిస్తున్నారు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా రాజకీయంగా కూడా తన ప్రభావాన్ని ఇతర రాష్ట్రాలకు, ముఖ్యంగా పొరుగున ఉన్న ఏపీకి విస్తరించాలని ఆలోచనలో విజయ్ ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**అద్భుత విజయంతో...**

తమిళనాడులో అద్భుత విజయాన్ని సొంతం చేసుకున్నారు విజయ్. కనీస అంచనాలు లేకుండా అధికార డిఎంకె, ప్రతిపక్ష అన్నాడీఎంకే కూటమిలను అధిగమించి మెజారిటీ సీట్లు సాధించారు. ఇతరుల సహకారంతో తమిళనాడులో అధికారం చేపట్టారు.. అయితే ఇదే స్ఫూర్తితో దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని విస్తరించాలన్న ఆలోచనతో ఉన్నారు విజయ్. అయితే తాజాగా దసరా ఉత్సవాలకు ఆహ్వానం అందడంతో ఇతర ముఖ్యమంత్రిలతో ఆయన వేదిక పంచుకోనున్నారు. విజయవాడ దసరా ఉత్సవాల వేదికగా ఆయన పర్యటిస్తే.. ఇక్కడి రాజకీయ, సామాజిక సమీకరణలపై ఆయనకు ఒక స్పష్టమైన అవగాహన వచ్చే అవకాశం ఉంది. ఇక్కడి స్పందనను చూసి భవిష్యత్తులో ఏపీ రాజకీయాల్లో టీవీకె ఏ రకమైన పాత్ర పోషించాలనే దానిపై ఆయన ఒక స్పష్టమైన నిర్ణయానికి రావచ్చు అని భావిస్తున్నారు. తమిళనాడు విజయ్ వేస్తున్న ప్రతి అడుగు జాతీయస్థాయిలోనూ ఆసక్తి రేపుతోంది.. ఇప్పుడు ఏపీ టూర్ ఖరారు అయితే తెలుగు రాజకీయాల్లో కూడా సరికొత్త చర్చకు దారి తీసే అవకాశం ఉంది.

# ఏపీ ప్రభుత్వానికి షాక్!



(మొదటి పేజీ తరువాయి)

అత్యున్నత న్యాయస్థానం. ఎస్సీ, ఎస్టీ,బీసీ రిజర్వేషన్ల మొత్తం కోట 50% సీలింగ్ మించకూడదన్న హైకోర్టు నిర్ణయం సరైనదేనని స్పష్టం చేస్తూ.. ప్రభుత్వం జారీ చేసిన జీవులను తప్పు పట్టింది. దీంతో 34% రిజర్వేషన్లు అనేది పార్టీల పరంగా అమలు చేసే వీలుంది.

**కొట్టివేసిన హైకోర్టు..**

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 34% రిజర్వేషన్లను అమలు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఆ నిర్ణయాన్ని తప్పుపడుతూ హైకోర్టు తీర్పు చెప్పింది. ప్రభుత్వ జీవోను రద్దు చేసింది. అయితే దీనిని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో ఈరోజు ఇరువర్గాల వాదనలు జరిగాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వానికి ఊరట నిచ్చేందుకు కోర్టు నిరాకరించింది. దీంతో తెలుగుదేశం కూటమి పార్టీల పరంగా రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వందకు పైగా మునిసిపాలిటీలు, 12 కార్పొరేషన్లలో 34 శాతం పదవులను బీసీలకు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.

**విరుద్ధమని తేల్చి చెప్పిన న్యాయస్థానం..**

మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదు అనే రాజ్యాంగబద్ధమైన నిబంధనను సుప్రీంకోర్టు తన తీర్పులో మరోసారి గట్టిగా సమర్ధించింది. శాస్త్రీయమైన ప్రాతిపదిక, సమగ్ర సమాచార సేకరణ లేకుండా ఏకపక్షంగా శాతాన్ని పెంచడం నిబంధనలకు విరుద్ధమని తేల్చి చెప్పింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్ధిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన ఈ నిర్ణయంతో... స్థానిక సంస్థల ఎన్నికల ప్రణాళికలు, రిజర్వేషన్ల కేటాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం 50% లోపు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ జీవోలు జారీచేసనుంది. అయితే ఇప్పటికే పార్టీ పరంగా 34% రిజర్వేషన్లను అమలు చేస్తామని టిడిపి ప్రకటించింది. మేయర్, మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ ల తో పాటు కౌన్సిలర్లు, వార్డు సభ్యులతో పాటు అన్నిచోట్ల బీసీలకు 34 శాతం టిక్కెట్లను టిడిపికి కేటాయించనంది.

# హుస్సేన్ సాగర్ టు ప్రకాశం బ్యారేజీ!

హైదరాబాద్ హుస్సేన్ సాగర్ నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీ వరకు సీ ప్లేన్ సేవల ప్రతిపాదన తెరపైకి వచ్చింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పర్యాటక రంగానికి ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగానే సీప్లేన్ సేవలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి విజయవాడకు రోడ్డు, రైలు, సాధారణ విమానాల రాకపోకలు ఉన్నాయి. అయితే ఇప్పుడు నీటి పైన టేక్ ఆఫ్ తో గాల్లో ప్రయాణించే సి ప్లేన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అదే జరిగితే తెలుగు రాష్ట్రాల ప్రజలకు రవాణా మరింత సులభతరం కానుంది.

**రెండు రాష్ట్రాల ఉమ్మడి ఆలోచన..:** హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సిప్లేన్ నడపాలని తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు కలిసి ఆలోచన చేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత జూలైలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో ఈ అంశంపై చర్చించారు. దీంతో ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం హుస్సేన్ సాగర్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. నీటి లోతు, టేక్ ఆఫ్ ల్యాండింగ్ కు అనువైన ప్రాంతాలు, జెట్టీలు, భద్రతా అంశాలపై సమీక్ష చేసింది. మరోవైపు ప్రకాశం బ్యారేజీ వద్ద కూడా ఇలాంటి సర్వే జరగనుంది. సాధారణ రన్వే అవసరం లేకుండానే నీటిపైనే ఈ సీ ప్లేన్లు ఎగురుతాయి. దిగుతాయి కూడా.

**తక్కువ ఎత్తులో ప్రయాణం..**

ఈ సి ప్లేన్లు అనేవి తక్కువ ఎత్తులో ప్రయాణం చేస్తాయి. వీటిలో 9 నుంచి 12 మంది ప్రయాణికులు సామర్థ్యం ఉంటుంది. హుస్సేన్ సాగర్ నుంచి బయలుదేరితే బుద్ధ విగ్రహం, సచివాలయం, ట్యాంక్ బండ్ అందాలు ఆకాశం నుంచి కనిపిస్తాయి. హుస్సేన్ సాగర్ నీళ్లపై సిప్లేన్లో ఎగిరి... ప్రకాశం బ్యారేజీ లో దిగేలా ప్లాన్ చేస్తున్నారు. కృష్ణానది మీదుగా ప్రయాణించి.. కృష్ణమ్మ అందాలను చూస్తూ ప్రకాశం బ్యారేజీలో దిగొచ్చు. సహజంగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాలంటే రోడ్డు మార్గంలో ఐదు నుంచి ఆరు గంటలు పడుతుంది. రైలులో అయితే నాలుగు నుంచి ఐదు గంటలు పడుతుంది. కానీ సిప్లేన్ తో దాదాపు 40 నుంచి 50 నిమిషాల్లో చేరుకోవచ్చు. పర్యాటకులతోపాటు వ్యాపారులకు ఇది చక్కటి మార్గం. దీంతో తెలుగు రాష్ట్రాల పర్యాటకాన్ని మరింత బలోపేతం చేయవచ్చు.



## అగ్రికల్చరల్ విద్యార్థి క్షణికావేశం: ఉరివేసుకొని ఆత్మహత్య

**రామకృష్ణాపూర్ అక్టోబర్ 9 (క్రైమ్ మిర్రర్):** క్షణికావేశంలో తీసుకున్న ఒక తప్పు నిర్ణయం ఒక యువకుడి ప్రాణాలను బలిగొంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అగ్రికల్చర్ డిప్లొమా విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీనివాసనగర్‌కు చెందిన కాంపెల్లి మున్నా (19) అనే యువకుడు కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని 'ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం'లో అగ్రికల్చర్ డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా, మున్నా సిగరెట్లు తాగుతున్నాడనే విషయమై కళాశాల అధ్యాపకులు గతంలో పలుమార్లు అతడి తల్లికి సమాచారం అందించారు. అంతేకాకుండా, ఇటీవల నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి తప్పక హాజరుకావాలని కళాశాల సిబ్బంది అతడి తండ్రికి ఫోన్ చేసి కోరారు. ఈ క్రమంలో ఈ నెల 5న కళాశాల నుంచి ఇంటికి వచ్చిన మున్నా ఇక్కడే ఉంటున్నాడు. గురువారం రోజున తండ్రి పని నిమిత్తం సిద్ధిపేటకు, తల్లి మంచిర్యాలకు వెళ్లడంతో ఇంట్లో మున్నా ఒక్కడే ఉన్నాడు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఇంటి రేకుల షెడ్‌కు ఉన్న ఇనుప పైపుకు మున్నా ఉరివేసుకుని వేలాడుతుండటాన్ని గమనించిన పొరుగింటి మహిళ వెంటనే స్థానికులకు సమాచారం అందించింది. స్థానికులు వెంటనే స్పందించి మున్నాను చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, మార్గమధ్యలోనే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

# ఇండియా కూటమిలోకి బీఆర్ఎస్!




(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** సోషల్ మీడియా వేదికగా ఆయన సంధిస్తున్న అస్త్రాల్లో అంతర్గత సందేశం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. రేవంత్ ను రాహుల్ కీలుబొమ్మ, అన్లిమిటెడ్ ఏటీఎం అంటూ నిందిస్తూనే.. ఆయనను కంట్రోల్ చేయాలని రాహుల్ గాంధీకి విజ్ఞప్తులు చేయడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహం ఉన్నట్లు చర్చ నడుస్తోంది. గతంలో గాంధీభవన్లో గాడ్సే తిరుగుతున్నాడు అంటూ కేటీఆర్ సెటైరికల్ గా మాట్లాడారు. గాంధీభవన్ మంచిదే కానీ.. అక్కడ కూర్చున్న రేవంత్ రెడ్డి మాత్రమే చెడ్డవాడన్నట్టు చిత్రీకరిస్తూ.. కేటీఆర్ చేసిన ఆరోపణల వెనుక బలమైన వ్యూహం ఉంది. రేవంత్ రెడ్డిని ఏకాకిని చేసి పక్కన పెట్టించాలన్నది కేటీఆర్ తాజా ఎత్తుగడగా అర్థం అవుతోంది.

**గతంలో చాలా సార్లు..**

రేవంత్ విషయంలో కేటీఆర్ ఇటువంటి రాజకీయ వ్యూహాలు చాలాసార్లు అమలు చేశారు. గతంలో రేవంత్ రెడ్డిని పిసిసి అధ్యక్షుడిగా నియమించవద్దని.. ఆయన చేతికి పగ్గాలు వెళ్లకుండా అడ్డుకోవాలని అధికారంలో ఉన్న గులాబీ పార్టీ చేయని ప్రయత్నం అంటూ లేదు. రేవంత్ పీసీసీ రేసులో తెరపైకి వచ్చిన ప్రతిసారి ఆయనపై వరుసగా కేసులు బనాయించడం, జైలుకు పంపి రాజకీయ భవిష్యత్తును దెబ్బతీయాలని చూడడం వంటి అణచివేత చర్యలు నడిచాయి. కానీ ఆ వ్యూహాలేవీ ఫలించలేదు. రేవంత్ అన్ని అడ్డంకులను అధిగమించి పిసిసి అధ్యక్షుడు అయ్యారు. అటు తరువాత గులాబీ పార్టీ పదేళ్ల కోటను బద్దలు కొట్టి తెలంగాణకు ముఖ్యమంత్రి అయ్యారు. నాడు రేవంత్ ఎదుగుదలను అడ్డుకోలేకపోయిన కేటీఆర్.. నేడు అధికారం కోల్పోయాక సరికొత్త రూటు ఎంచుకున్నారు. రేవంత్ ని తప్పిస్తే లేదా ఆయన దూకుడుకు కళ్లెం వేస్తే.. భవిష్యత్తులో తాము కేంద్రంలో కాంగ్రెస్తో సఖ్యతగా ఉండేందుకు.. లేకుంటే దగ్గర అయ్యేందుకు అభ్యంతరం లేదన్న సంకేతాలను ఢిల్లీ అధిష్టానానికి పంపించే ప్రయత్నం చేస్తున్నారు.

**దారుణంగా దెబ్బతిన్న కాంగ్రెస్..**

అయితే గత పరిణామాల దృష్ట్యా కేటీఆర్ మైండ్ గేమ్ ను కాంగ్రెస్ పార్టీ పట్టించుకునే అవకాశం లేదు. గతంలో కెసిఆర్ ఆడిన మైండ్ గేమ్ తో కాంగ్రెస్ దారుణంగా దెబ్బతింది. గులాబీ పార్టీతోపాటు కేసీఆర్ నుంచి ఎన్నో చేదు అనుభవాలు ఉన్నాయి కాంగ్రెస్ పార్టీకి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీని తెలంగాణ తల్లిగా కీర్తించి.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత టిఆర్ఎస్ను కాంగ్రెస్లో విలీనం చేస్తామని నాటి ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ ఇచ్చిన హామీని తుంగలో తొక్కారు. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకున్నారు. అసలు తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ పార్టీ అనేది లేకుండా చేయాలని చూశారు. అలాంటి చరిత్రను రాహుల్ గాంధీ కానీ.. కాంగ్రెస్ సాయి కమాండ్ కానీ అంత తేలిగ్గా మర్చిపోతాయని ఎవరూ భావించడం లేదు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి మాత్రమే కాదు. ఇండియా కూటమికి రాజకీయంగా అండగా నిలుస్తున్న ఒక మాస్ లీడర్. అలాంటి నాయకుడిని వదులుకొని.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని లేకుండా చేసేందుకు ప్రయత్నించిన గులాబీ పార్టీ మాటలను హై కమాండ్ నమ్మే అవకాశం లేదని పొలిటికల్ వర్గాల్లో ఒక ప్రచారం ఉంది. అయితే కేవలం కాంగ్రెస్ పార్టీలో ఉన్న అసమ్మతి నాయకులను రేవంత్ పై ఎగదోయడం ద్వారా రేవంత్ ను ఇబ్బందుల్లో పెట్టాలని చూస్తున్నారు కేటీఆర్. చూడాలి మరి ఏం జరుగుతుందో..




## ఓటు హక్కు పరిరక్షణకు 'సేవ్ అవర్ ఓట్స్'

### సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో బ్యాలెట్ బాక్స్ ఉద్యమం

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 09:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓటు హక్కు పరిరక్షణ పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంగారెడ్డిలో 'సేవ్ అవర్ ఓట్స్' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్స్‌లో ప్రజలు తమ పేర్లు, పోలింగ్ బూత్ నంబర్లు, ఓటు హక్కు పరిరక్షణ సందేశాలతో కూడిన వినతులను వేశారు. ఈ సందేశాలను రాష్ట్రపతికి పంపించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కు అని, దానిని కాపాడుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్నారంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ఓటు హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీకి సంగారెడ్డి ప్రజల తరపున సంఘీభావం తెలుపుతున్నట్లు చెప్పారు. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియలో 73 లక్షల ఓట్లు తొలగించారని, 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇచ్చారని జగ్గారెడ్డి ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు చేస్తూ, ఓటు హక్కుల పరిరక్షణకు ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా తమ నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## కుక్కడంలో కలకలం.. ఇంట్లోకి దూసుకెళ్లిన డీసీఎం!

ఒక్కసారిగా ఉలిక్కిపడిన స్థానికులు!

డ్రైవర్ నిర్లక్ష్యమా.. లేక మరేదైనా కారణమా?

ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది



మాడుగులపల్లి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి: నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామంలో శుక్రవారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఏపీ16 టీపీ 3679 నంబర్ గల డీసీఎం వాహనం అదుపుతప్పి కట్ట కొండల్ రెడ్డి అనే వ్యక్తి ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. డీసీఎం వాహనం ఇంట్లోకి దూసుకెళ్లడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. అయితే, అదృష్టవశాత్తూ పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అసలు డీసీఎం వాహనం ఎందుకు అదుపుతప్పింది? డ్రైవర్ నిర్లక్ష్యమా.. లేక మరేదైనా కారణమా? అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జీఓ 59 పెండింగ్ దరఖాస్తులకు నెలలోపు పరిష్కారం



హైదరాబాద్, అక్టోబర్ 9: స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుని చాలాకాలంగా ఎదురుచూస్తున్న వారికి తెలంగాణ ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం ప్రకటించింది. జీఓ 59 కింద నిలిచిపోయిన దరఖాస్తుల్లో 500 చదరపు గజాల లోపు విస్తీర్ణం ఉన్న ప్లాట్లకు సంబంధించిన ఫైళ్లను నెల రోజుల్లోగా

పరిష్కరించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. పెండింగ్ వ్యవహారాలను వేగంగా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలిపారు.

**పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**

జీఓ 59 కింద పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తులను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వం మెమో నెం. 48030 జారీ చేసినట్లు మంత్రి వివరించారు. ఈ ప్రక్రియలో నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని, అక్రమాలకు అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే జారీ చేసిన కన్వేయన్స్ డీడ్‌లను కూడా సమగ్రంగా పరిశీలిస్తామని తెలిపారు.

**22-ఏ సమస్యల పరిష్కారానికి చర్యలు**

రాష్ట్రంలో 22-ఏ జాబితాకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పొంగులేటి పేర్కొన్నారు. సీఎం హామీ ఇచ్చిన 24 గంటల్లోనే ఈ అంశంపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వివిధ రకాలుగా ఉన్న 10 నుంచి 12 సమస్యలను గుర్తించి, వాటికి త్వరితగతిన పరిష్కారా లు చూపేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. జీఓ 118, జీఓ 76లకు సంబంధించి కూడా స్పష్టతనిస్తూ మెమోలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.

**అనుమతులున్న ఆస్తుల రిజిస్ట్రేషన్లకు అవకాశం**

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి ముందస్తు అనుమతులు పొందినప్పటికీ 22-ఏ జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి కల్పిస్తున్నట్లు పొంగులేటి ప్రకటించారు. దీంతో నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన ఆస్తుల విషయంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. మొత్తంగా జీఓ 59 దరఖాస్తుల పరిష్కారానికి నెల రోజుల గడువు ప్రకటించడం, 22-ఏ సమస్యలపై చర్యలు చేపట్టడం ద్వారా పెండింగ్ భూ వ్యవహారాలను త్వరగా కొలిక్కి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# వర్షాభావ పరిస్థితులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి

**పంట నష్టాలు, భూగర్భ జలాలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి**

**నీటి సంరక్షణ పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్**

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 09: ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పంట నష్టాలు, వర్షపాతం లోటు, భూగర్భ జలాల లభ్యత, తాగునీటి సరఫరా, విద్యుత్ డిమాండ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, కరువు మండలాల గుర్తింపుపై సమీక్షించారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 20 శాతం లేదా అంతకంటే ఎక్కువ లోటు నమోదైన మండలాలను గుర్తించి నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. పంటలు ఎండిపోయిన ప్రాంతాలు, సాగు విస్తీర్ణం




తగ్గిన భూముల వివరాలను సేకరించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులను విస్తృతం చేయాలని, నీటి సంరక్షణ, చెరువుల పూడికతీత, కాలువల మరమ్మతులు, ఫార్మ్ పాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. భూగర్భ జలాల పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని, బోరుబావుల రీచార్జ్ పనులను అక్టోబర్ 25లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంగారెడ్డి జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు చేపడుతున్న చర్యలను వివరించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై జిల్లాలో భూగర్భ జలమట్టాలు, తాగునీటి వనరులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరా పరిస్థితులను సమీక్షించారు.

నీటి మట్టాలు తగ్గుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటల పునరుద్ధరణ, ఇంకుడు గుంతల నిర్మాణం, బోరుబావుల రీచార్జ్ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మున్సిపాలిటీల్లో నీటి నిల్వలు, పైప్‌లైన్ లీకేజీలు, పంపింగ్ వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

రాబోయే రోజుల్లో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతు వేదికల ద్వారా నీటి పొదుపు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

ప్రజలు, రైతులు ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అధికార దుర్వినియోగం

**అర్హులకు అన్యాయం -- కాంగ్రెస్ కార్యకర్తలకే ప్రాధాన్యం**

**కాగితాలకే పరిమితమైన నిబంధనలు**

**కాంగ్రెసేతర ?సర్పంచులు, ఇందిరమ్మ కమిటీల జాబితాల బుట్టదాఖలు**

**ప్రజల డబ్బుతో రాజకీయాలా?**

**కాంగ్రెస్ కండువా కప్పితేనే ఇల్లా?**

**పారదర్శకత లోపించిన ఎంపిక విధానం**

**పేదలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం**

**అధికార దుర్వినియోగం పై న్యాయపోరాటం**

**విలేకరుల సమావేశంలో సిపిఐ ( ఎం ) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కేటాయింపుల్లో జిల్లా వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో అధికార దుర్వినియోగం, రాజకీయ వివక్ష జరుగుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించకుండా, కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాంగ్రెస్ జెండా కప్పుకున్న వారికే ప్రాధాన్యమిస్తూ ఇళ్లను మంజూరు చేస్తున్నారని, ఇది పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కాంగ్రెసేతర పార్టీల సర్పంచులు, ఇందిరమ్మ కమిటీలు నిబంధనల ప్రకారం సిద్ధం చేసి ఇచ్చిన అర్హులైన నిరుపేదల జాబితాలను అధికారులు, మంత్రులు పూర్తిగా బుట్టదాఖలు చేస్తున్నారని ఆధారాలతో సహా వెల్లడించారు. ఈ అన్యాయంపై అధికారులు, ప్రభుత్వం వెంటనే తమ తీరు మార్చుకోకపోతే జిల్లా వ్యాప్తంగా బాధితులైన పేదలతో కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని, అవసరమైతే కోర్టులను ఆశ్రయించి న్యాయ పోరాటం చేసి పేదలకు ఇళ్లు దక్కేలా చూస్తామని ఆయన హెచ్చరించారు. ?కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఐదేళ్ల కాలంలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ప్రతీ నిరుపేద కుటుంబానికి నీడ కల్పిస్తామని హామీ ఇచ్చిందని నున్నా నాగేశ్వరరావు గుర్తుచేశారు. మొదటి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్లు ప్రకటిస్తూ, అర్హుల ఎంపిక కోసం ఎల్-1, ఎల్-2, ఎల్-3 వర్గీకరణను రూపొందించారని తెలిపారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారిని, రేకుల ఇళ్లు లేదా చిన్న గుడిసెలలో నివాసముంటున్న అత్యంత నిరుపేదలను మొదటగా ఆదుకుంటామని ప్రకటించారన్నారు. దీని ప్రకారం ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు గాను మొదటి పేజ్‌లో 16,872 ఇళ్లు, రెండో పేజ్‌లో 10,400 ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. అయితే ఆచరణలోకి వచ్చేసరికి ప్రభుత్వం చెప్పిన నిబంధనలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని, క్షేత్రస్థాయిలో అధికార పార్టీ నాయకుల ఇష్టారాజ్యమే నడుస్తోందని విమర్శించారు. ?గ్రామాల్లో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా, గ్రామాభివృద్ధిని కాంక్షించే గ్రామ సర్పంచ్ చైర్మన్‌గా ఉండే ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన ఆమోదిత జాబితాల ప్రకారమే ఇళ్లు కేటాయించాలని నిబంధనలు చెప్తున్నాయని నాగేశ్వరరావు పేర్కొన్నారు. కానీ జిల్లాలో కాంగ్రెసేతర సర్పంచులు ఉన్న గ్రామాల్లో వారిని పూర్తిగా పక్కనబెట్టి, వారి ఇచ్చిన లిస్టులను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోవడం లేదని ఆరోపించారు. మంత్రులు కూడా ఇతర పార్టీల సర్పంచులు ఇచ్చిన అర్హుల జాబితాలను పట్టించుకోకుండా, కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇచ్చిన జాబితాలకే ఇళ్లను మంజూరు చేస్తూ తీవ్ర వివక్ష చూపిస్తున్నారని మండిపడ్డారు. ఉదాహరణకు తిరుమలాయపాలెం మండలంలోని ఎదుళ్ల చెర్వు, ఎం.వెంకటాయపాలెం, కొదుమూరు, నేలకొండపల్లి, పాలేరు, నాయకన్ గూడెం, మల్లేపల్లి, గట్టు సింగారం, నేలపట్ల, మధిర తదితర ప్రాంతాల్లో సర్పంచులు నిబంధనల ప్రకారం అత్యంత అర్హులైన పేదల పేర్లతో జాబితా ఇస్తే, అందులో ఒక్కరికి కూడా ఇల్లు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ?కొన్ని గ్రామాల్లో ఎల్-1 కేటగిరీలో అర్హులైన నిరుపేదలు ఉన్నప్పటికీ, వారికి ఇవ్వకుండా రాజకీయ ఒత్తిళ్లతో ఎల్-2, ఎల్-3 లో ఉన్న కాంగ్రెస్ నాయకుల అనుచరులకే కట్టబెడుతున్నారని పేర్కొన్నారు. మరికొన్ని చోట్ల మంజూరైన ఇళ్లకు అర్హులు లేరనే నెపంతో వెనక్కి పంపడం లేదా ఇతర పార్టీలకు చెందిన పేదలను కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే ఇళ్లు ఇస్తామని బెదిరింపులకు గురిచేయడం తుగ్లక్ పాలనను తలపిస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అనేది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిధులతో, ప్రజలు కట్టిన పన్నుల డబ్బుతో అమలు చేస్తున్న సంక్షేమ పథకమని, ఇది కాంగ్రెస్ పార్టీ సొంత నిధుల నుంచి ఇస్తున్నది కాదని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ ఫలాలను ఒక పార్టీకే పరిమితం చేయడం చట్టవిరుద్ధమని హితవు పలికారు. ?గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు సమయంలో గ్రామసభలు నిర్వహించి, అర్హులైన పేదలందరినీ గుర్తించి, పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా ఇళ్లను ఎంపిక చేశారని ఆయన గుర్తుచేశారు. దానివల్ల ఎలాంటి వివాదాలు లేకుండా అర్హులకు ఇళ్లు దక్కాయని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అటువంటి పారదర్శక విధానాన్ని అమలు చేయాలని లేదా గ్రామసభలు, సర్పంచుల కమిటీ నిర్ణయించిన జాబితాల ప్రకారం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను కాపాడాల్సిన అధికారులే అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి చట్టాన్ని ఉల్లంఘిస్తే, వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునేలా న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ?ఈ అధికార దుర్వినియోగం, అక్రమాలపై త్వరలోనే సీపీఎం ప్రతినిధి బృందం, బాధితులైన ప్రజాప్రతినిధులతో కలిసి ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను కలవనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వివక్షను ఆధారాలతో సహా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే విచారణ జరిపించి అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. ఒకవేళ జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా ఇదే రకమైన వైఖరిని కొనసాగిస్తే, బాధితులైన నిరుపేదలందరినీ ఏకం చేసి కలెక్టరేట్ ముట్టడితో పాటు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, అలాగే కోర్టు ద్వారా న్యాయ పోరాటం చేసి పేదల హక్కులను కాపాడతామని నున్నా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో సిపిఐ ( ఎం ) పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్,వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, భూక్యా వీరభద్రం, మాదినేని రమేష్, పాల్గొన్నారు.



## జాతీయ నాయకుల చిత్రపటాల ఆవిష్కరణ

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం చిన్నకాపర్తి ఈ రోజు ప్రాథమిక పాఠశాల చిన్నకాపర్తి లో కస్తూరి ఫౌండేషన్ వారు అందించిన జాతీయ నాయకుల చిత్రాలను గ్రామ సర్పంచ్ ఆవుల సుందరయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ ఆవుల సుందరయ్య మాట్లాడుతూ, కస్తూరి ఫౌండేషన్ వారు చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి, తమ గ్రామానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మర్యాద అశోక్ రెడ్డి మాట్లాడుతూ . పాఠశాలకు జాతీయ నాయకుల చిత్రాలను అందించిన కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీ కస్తూరి చరణ్ కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ నాయకుల చిత్రపటాలను పాఠశాలకు అందించడంలో కస్తూరి ఫౌండేషన్ సభ్యులు శ్రీ పంతంగి కరుణాకర్ గౌడ్ అందించిన సహకారానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రపటాలు విద్యార్థుల్లో జాతీయ నాయకుల పట్ల గౌరవం, దేశభక్తి భావనలను పెంపొందించడంతో పాటు, వారి జీవితాల నుంచి స్ఫూర్తి పొందేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మిర్యాల ధనలక్ష్మి , అంగన్వాడి సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు,గ్రామ పెద్దలు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

**మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు**



**చండూరు, క్రైమ్ మిర్రర్ :** దసరా సెలవులు ప్రారంభం కానున్న దృష్ట్యా ముందస్తు బతుకమ్మ సంబరాలను శుక్రవారం నాడు స్థానిక గాంధీజీ విద్యాసంస్థల్లో ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు గౌరీదేవికి పూలమాలలు వేసి పూజ చేసి బతుకమ్మ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి మరియు సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఈ పండుగను తెలంగాణ ఆడపడుచులు వారి పుట్టింటిలో ఘనంగా జరుపుకుంటారని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ... బంధాలు మరియు అనుబంధాలను గుర్తు చేసుకుంటూ.... ఆడపడుచులు తొమ్మిది రోజులపాటు పూలతో గౌరీదేవిని పూజిస్తారని, మహాలయ అమావాస్య నాడు ఎంగిలిపూల బతుకమ్మగా ప్రారంభమై చివరి రోజు సద్దుల బతుకమ్మగా ముగుస్తుందని తెలిపారు. విద్యార్థినులు మహిళా ఉపాధ్యాయులు సాంప్రదాయ వస్త్రధారణతో, పూలతో అలంకరించుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగురంగుల బతుకమ్మలతో పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. బతుకమ్మ పండుగ పర్యావరణాన్ని ఆదరించే ఆచారానికి ప్రతీక అని పేర్కొన్నారు. సత్యం చెడుపై గెలిచే విజయదశమి సందేశం చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ జానీ, పులిపాటి రాధిక, కందుల కృష్ణయ్య ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగ గా బతుకమ్మ సంబరాలు

**పాల్గొన్న పురపాలక చైర్‌పర్సన్ పందిరి గీత రమేష్**

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల పురపాలిక పరిధిలోని పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారంప్రధానోపాధ్యాయురాలు బోడ సుశీల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పురపాలక చైర్‌పర్సన్ పందిరి గీత రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో జానపద గేయాలు, కోలాటాలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు దోహదపడతాయని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి: వేజండ్ల సాయికుమార్




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఢిల్లీ కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా జాతీయ యువజన కాంగ్రెస్ చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్ హాజరు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్ డిమాండ్ చేశారు. గత పార్లమెంటు ఎన్నికలతో పాటు వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని, బీజేపీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం నిలవాలంటే ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని పేర్కొన్నారు. జాతీయ యువజన కాంగ్రెస్ పిలుపు మేరకు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిర్వహించ తలపెట్టిన సత్యాగ్రహ దీక్షలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డితో కలిసి వేజండ్ల సాయికుమార్ ఈరోజు ఢిల్లీలోని యువజన కాంగ్రెస్ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ఓటు హక్కు పవిత్రతను పరిరక్షించాలని, ప్రజాస్వామ్య విలువలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని సాయి డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండే వరకు తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## నాంపల్లి గాంధీజీ లో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు

**బతుకమ్మ ఆటపాటలతో ఆకట్టుకున్న నాంపల్లి గాంధీజీ చిన్నారులు**

**సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ**

**చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు**

**క్రైమ్ మిర్రర్,నాంపల్లి:** ముందస్తు బతుకమ్మ సంబరాలను నాంపల్లి మండల కేంద్రంలోని గాంధీజీ విద్యాసంస్థల్లో శుక్రవారం రోజున ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు గౌరీదేవికి పూలమాలలు వేసి, పూజలు చేసి బతుకమ్మ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఈ పండుగను తెలంగాణ ఆడపడుచులు వారి పుట్టింటిలో ఘనంగా జరుపుకుంటారని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ... బంధాలు అనుబంధాలను గుర్తు చేసుకుంటూ.... ఆడపడుచులు తొమ్మిది రోజులపాటు పూలతో గౌరీదేవిని పూజిస్తారని, మహాలయ అమావాస్య నాడు ఎంగిలిపూల బతుకమ్మగా ప్రారంభమై చివరి రోజు సద్దుల బతుకమ్మగా ముగుస్తుందని తెలిపారు. విద్యార్థినులు మహిళా ఉపాధ్యాయులు సాంప్రదాయ వస్త్రధారణతో, పూలతో అలంకరించుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రంగురంగుల బతుకమ్మలతో పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. బతుకమ్మ పండుగ పర్యావరణాన్ని ఆదరించే ఆచారానికి ప్రతీక అని పేర్కొన్నారు. సత్యం చెడుపై గెలిచే విజయదశమి సందేశం చక్కగా వివరించారు. గౌరీ మాత వేషధారణలో ఉన్న చిన్నారులు ఎంతగానో ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్లు కర్నాటి నాగరాజు, సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ సామల వెంకటేశ్వర్లు, చిలుకూరి రామేశ్వరి, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ వేడుకలు**



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం రంగురంగుల పూలతో కళకళలాడింది. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల పూలతో అందంగా చిన్నారులు అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, ఐకమత్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి పండుగల నిర్వహణ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, పండుగల ద్వారా ఐక్యత, స్నేహభావం, ప్రకృతి పరిరక్షణ వంటి విలువలను అలవర్చుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. పాఠశాలలో బతుకమ్మ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరగడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుకలు పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు..

# పారదర్శకతోనే జవాబుదారీ పాలన

- తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్‌రెడ్డి
- గడిచిన 15 నెలల కాలంలో ఎంతో పురోగతి సాధించామన్న సిఐసి
- కమిషన్ స్థాయిలో సగటున రోజుకు 60 కేసులు- నెలకు సుమారు 1200 కేసులు విచారించారిస్తున్నట్లు వెల్లడి.
- అధికారిక లిఖితపూర్వక సమాధానానికి ప్రత్యేక విలువ.
- 2014 నుండి 2023 వరకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో 2000 కేసులకు పరిష్కారం
- ముగ్గురు దరఖాస్తుదారులు దాఖలు చేసిన 4000 కేసుల కేసులను విచారించేందు పూర్తిస్థాయి ధర్మాసనం.
- 23 జిల్లాలు, 24 శాఖలలో సున్నా పెండింగ్ కేసులు సాధించామన్న డా. చంద్రశేఖర్‌రెడ్డి.





**హైదరాబాద్ : ( క్రైమ్ మిర్రర్) :** రాష్ట్రంలో సమర్థవంతమైన పారదర్శకమైన జవాబుదారీతనం పాలనను అందించాలనే లక్ష్యంతో నూతన దార్శనికతతో ప్రభుత్వం 2025 మే నెలలో సమాచార కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. రవీంద్ర భారతీలో శుక్రవారం జరిగిన సమాచార హక్కు వారోత్సవాలు --2026లో ఆయన గడిచిన 15 నెలల కాలంలో కమీషన్ సాధించిన పురోగతని వెల్లడించారు. ఈసందర్భంగా డాక్టర్ జి. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పౌరులు వేలాది టెలివిజన్ ఛానెళ్ళ, బిల్డ్‌నౌ, భూ భారతి, మీసేవ వంటి ప్రభుత్వ పోర్టల్స్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాధనాల ద్వారా సమాచారాన్ని పొందుతున్నారని చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వ సంస్థ నుండి తపాలా ద్వారా అందిన అధికారిక లిఖితపూర్వక సమాధానానికి ప్రత్యేక విలువ ఉంటుందని తెలిపారు. అది ప్రామాణికమైనదిగా కాకుండా విశ్వసనీయమైన రికార్డును అందిస్తుంది కాబట్టి పౌరులు దానిని సంవత్సరాల తరబడి భద్రపరుచుకుంటారని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం తెలంగాణలో సుమారు లక్ష మంది పౌరులు ఆర్టీఐ చట్టం కింద వివిధ కార్యాలయాల నుండి సమాచారాన్ని కోరుకుంటారని, ఈ దరఖాస్తులలో చాలా వరకు ప్రజా సమాచార అధికారి (పిఐఓ) స్థాయిలోనే పరిష్కరించబడ తాయన్నారు. సమాచార కమిషన్‌కు ఏటా సుమారు 12,000 అప్పీళ్లు , ఫిర్యాదులు అందడమే కాకుండా సుమారు 18000 కేసులకు సంబంధించి పాత బకాయిలను కూడా కమిషన్ పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. గత 15 నెలల్లో తెలంగాణ సమాచార కమిషన్ కమిషనర్ల తోపాటు సిబ్బందికి డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ లో వారం రోజుల పాటు విస్తృతమైన ఆర్.టి.ఐ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు ఆర్.టి.ఐ పై జ్ఞానాన్ని పునశ్చరణ చేసుకోవడంతో పాటు నవీకరించుకోవడానికి దోహదం చేస్తున్నాయన్నారు. కమీషన్ కార్యాలయాన్ని న్యాయ, పరిపాలనా విభాగాలుగా పునః వ్యవస్థకరించడతో స్పష్టమైన బాధ్యతలు, విధుల కేటాయింపులు జరిగాయన్నారు. దాంతో కమిషన్ స్థాయిలో సగటున రోజుకు 60 కేసుల చొప్పున నెలకు సుమారు 1200 కేసులు విచారించారిస్తున్నట్లు తెలిపారు. కేవలం గత 15 నెలల్లో దాదాపు 20000 అప్పీళ్లు ,ఫిర్యాదులు విచారించి పరిష్కరించామన్నారు. ఈ విచారణల సమయంలో కమిషనర్లకు వేలాది మంది అప్పీలుదారులు, అధికారుల వాదనలు వినే అవకాశం లభించిందని. వాదనల సంభాషణలు, పదేపదే ఎదురయ్యే ఇబ్బందులను గుర్తించడానికి,ప్రభుత్వ అధికారులకు మరింత సంపూర్ణమైన సకాలంలో స్పందించేలా మార్గనిర్దేశం చేయడానికి ఉపయోగపడ్డాయన్నారు. జీరో పెండెన్సీ నమూనాను అవలంబించడం ఫలితంగా 23 జిల్లాలు, 24 శాఖలు కమిషన్ స్థాయిలో దాదాపు సున్నా పెండింగ్‌ను సాధించడం కమీషన్ పని తీరుకు నిదృనంగా చెప్పారు. అంతేకాకుండా కొత్త కేసులను సకాలంలో పరిష్కరించడానికి పునాది వేసింది అయయ్యిందన్నారు. 2014 నుండి 2023 వరకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సుమారు 2000 కేసులను ప్రాధాన్యత ప్రాతిపదికన స్వీకరించి పరిష్కరించినట్లు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ముగ్గురు దరఖాస్తుదారులు కలిసి దాదాపు 4000 కేసులు దాఖలు చేయగా, ఆ కేసులను విచారించడానికి ఒక పూర్తి ధర్మాసనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక దరఖాస్తుదారుడి విషయంలో విచారణలు జరిపి ఉత్తర్వులు జారీ చేయగా, మిగిలినవి దరఖాస్తులను త్వరలో పరిష్కరించనున్నన్నామన్నారు. 26 జిల్లాల్లో ఆర్టీఐ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజా సమాచార అధికారులు , ఆర్థిక సహాయక అధికారుల తోపాటు పౌరులతో కలపి 10000 మందికి పైగా శిక్షణ ఇవ్వడం జరిగిందని స్పష్టం చేశారు. ఆర్టీఐ కార్యకలాపాలను సులభతరం చేయడానికి కమిషన్‌తో సమన్వయం చేసుకునేందుకు ప్రతి శాఖ మరియు జిల్లాలో నోడల్ అధికారులను నియమించామన్నారు. పౌర స్నేహపూర్వక ఆర్టీఐ చట్టం అమలును ప్రోత్సహించడంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలు, విభాగాలు, హెచ్ఓడీలు, పీఐఓలు, ఎఫ్ఏఏలు, ఏపీఐఓలను గుర్తించి, శ్రేష్ఠతను ప్రోత్సహించేందుకు ఆర్టీఐ పనితీరు పురస్కారాలను అందజేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఆర్టీఐ చట్టంలోని 4(1)బి సెక్షన్ కింద ఉత్తమమైన , క్రమానుగతంగా నవీకరించబడిన స్వచ్ఛంద సమాచార వెల్లడి కోసం ఒక ప్రత్యేక పురస్కారాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇది అత్యంత ముఖ్యమైన అజెండా అని, టీజీఐసీకి ఒక బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకురావడానికి ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లోగోను విడుదల చేయడం జరిందని తెలిపారు. క్రమానుగత పురోగతి నివేదికలను ఎప్పటికప్పుడు 'సమాచార దర్పణం' అనే న్యూస్‌లెటర్ రూపంలో ప్రచురిస్తున్నామన్నారు. అందుబాటును మెరుగుపరచడానికి కేసుల షెడ్యూల్, నోటీసులు,తుది తీర్పు ఉత్తర్వులను టీజీఐసీ వెబ్‌సైట్‌లో ఉంచడంతో పాటు ఆన్‌లైన్ అప్పీళ్లను కూడా టీజీఐసీ వెబ్‌సైట్ ద్వారా స్వీకరిస్తున్నామని రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ తెలిపారు. కమిషన్‌లో హైబ్రిడ్ విచారణను ప్రారంభించి ఇప్పటివరకు దాదాపు 1000 అప్పీళ్లను ఆన్‌లైన్‌లో పరిష్కరించామన్నారు. హైదరాబాద్ నుండి నిర్వహించిన జిల్లా స్థాయి ప్రచార కార్యక్రమాలు, హైబ్రిడ్ విచారణల తో పౌరులు, అధికారులు దూరంగా ఉండి పాల్గొనే వీలు కల్పించడంతో పాటు సమయం, ఖర్చులను ఆదా అయ్యేలా చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. 2014 నుండి 2023 సంవత్సరం వరకు గల వార్షిక నివేదికలు తయారు చేసి, పదేళ్ల పెండింగ్ పనులను పరిష్కరిస్తూ శాసనసభ, శాసన మండలి ఉభయ సభల ముందు ఉంచినట్లు తెలిపారు. ఇక 2024, 2025 సంవత్సరాల వార్షిక నివేదికలు సిద్ధంగా ఉన్నాయని వాటిని కూడా త్వరలో ఉభయ సభలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఆర్టీఐ అమలులో కార్యాచరణ ఏకరూపత పై నిర్వహించిన జాతీయ సదస్సు ఏఎస్‌సీఐ సహకారంతో అందరినీ ఒకచోట చేర్చిందని ఆయన గుర్తు చేశారు.



## పిఎంశ్రీ జెడ్పీఎచ్ఎస్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలు

### సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

### ప్రధానోపాధ్యాయులు బట్టు మధు

**క్రైమ్ మిర్రర్,నేరేడుచర్ల :** పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల లో ముందస్తు బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా, సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా జరిగాయి.తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ వేడుకల (ఎంగిలిపూల బతుకమ్మ నుండి సద్దుల బతుకమ్మ వరకు) నేపథ్యంలో, పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలిసి ముందస్తుగానే ఈ సంబురాలను జరుపుకున్నారు.బాలికలు ఉపాధ్యాయినిలు ఆనందోత్సాహాలతో ముందస్తు బతుకమ్మ సంబరాలలో బతుకమ్మ చుట్టూ నృత్యాలు కోలాటాలతో పాటలు పాడుతూ ఆనందంగా వేడుక చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ మనసుకు ఎంతో ఆహ్లాదాన్నిచ్చే పూవులను,తద్వారా ప్రకృతిని ఆరాధిస్తూ పూజించే ప్రత్యేక పండుగ బతుకమ్మ అని ఇది తెలంగాణకే సొంతమైన ప్రత్యేక పండుగనీ అన్నారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనర్ వీరవెల్లి శ్రీలత, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సన్ షైన్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు




**చండూరు, క్రైమ్ మిర్రర్:** చండూరు మున్సిపాలిటీ లోని సన్ షైన్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులు సేకరించిన వివిధ రకాల పూలను అందంగా బతుకమ్మల రూపంలో పేర్చి పాఠశాల డైరెక్టర్ కోడి సుష్మ గారు, ఉపాధ్యాయురాళ్ళు, విద్యార్థినులు అందరూ కలిసి బతుకమ్మల ఆటపాటలతో పాఠశాల ప్రాంగణంలో ఉత్సాహకరమైన ఆనందోత్సవ వాతావరణంలో బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న గారు మాట్లాడుతూ తొమ్మిది రోజులు బతుకమ్మలను ఏ విధంగా నిర్వహిస్తారు మరియు ఒక్కొక్క రోజు బతుకమ్మకు గల పేర్లను వివరిస్తూ బతుకమ్మ విశిష్టతను విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాలలో ఐదు అడుగుల బతుకమ్మను పేర్చిన విద్యార్థినీ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికాంత్, వైస్ ప్రిన్సిపాల్ వినయ్, బతుకమ్మ నిర్వాహకులు రమేష్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కాంట్రాక్టు ఉపాధ్యాయురాలికి వేతనం అందజేత

### కేపీహెచ్‌బీలోని ప్రభుత్వ పాఠశాలకు చేయూత



**కూకట్ పల్లి, అక్టోబర్ 09 (క్రైమ్ మిర్రర్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి ఆదర్శమైన 'సేవా హీ సంఘటన్', 'జాతి ప్రథమం' స్ఫూర్తితో కేపీహెచ్‌బీలోని ప్రభుత్వ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయురాలి వేతనానికి ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ పవన్ కుమార్ నర్వ గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. శుక్రవారం కేపీహెచ్ బి కాలనీ నాలుగవ ఫేజ్ ప్రభుత్వ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయురాలి వేతనాన్ని తన వంతు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా వేతనానికి సంబంధించిన చెక్ ను ఉపాధ్యాయురాలికి అందజేశారు. అనంతరం బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ నర్వ పవన్ కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నరేంద్ర మోదీ స్ఫూర్తితో విద్యా రంగానికి తన వంతు సహాయ సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయురాలి వేతనాన్ని గత ఐదు సంవత్సరాలుగా తాను అందిస్తున్నట్లు తెలిపారు. గుజరాత్ సీఎంగా మొదలై దేశ ప్రధానిగా మోదీ సాగించిన పాతికేళ్ల ప్రయాణం సుపరిపాలనకు, నిస్వార్థ సేవకు నిదర్శనమని పేర్కొన్నారు. నిజమైన సేవ మాటల్లో కాక చేతల్లోనే ఉంటుందని, అట్టడుగు స్థాయి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వికసిత భారత్-2047 లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ సమాజ సేవకు కట్టుబడాలని ఆయన పిలుపునిచ్చారు.




## ఈ-వ్యర్థాలపై అవగాహన పెంచుకోవాలి: జీఎం రాధాకృష్ణ

**మందమర్రి అక్టోబర్ 9 (క్రైమ్ మిర్రర్)** పర్యావరణానికి హాని కలిగించే ఈ-వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి, శాస్త్రీయ పద్ధతిలో తొలగించాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ సూచించారు. సింగరేణి సంస్థలో అక్టోబరు 2 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో ఈ-వ్యర్థాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాల్లో నిరుపయోగంగా ఉన్న విద్యుత్ పరికరాల విడిభాగాలు, కంప్యూటర్ మానిటర్లు, కీబోర్డులు, మౌస్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను జీఎం రాధాకృష్ణ స్వయంగా సేకరించి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డబ్బాలో వేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పాత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, విద్యుత్ తీగలు, స్విచ్‌లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేయరాదన్నారు. వాటిని ప్రత్యేకంగా సేకరించి, సరైన పద్ధతిలో తొలగించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. కార్యాలయాలు, గనులతో పాటు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ-వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలపై అధికారులు, ఉద్యోగులు అవగాహన పెంచుకుని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎంకు ప్రత్యేక అధికారి జి.ఎల్. ప్రసాద్, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, ఏరియా ఈ అండ్ ఎం ఏజీఎం బాలాజీ భగవతీ జా, ఏజీఎం (ఎఫ్ అండ్ ఏ) ఆర్.వి.ఎస్.ఆర్.కే. ప్రసాద్, డీజీఎం (సర్వే) బుఖ్యా దేశాయి, ఐటీ డిప్యూటీ మేనేజర్ రవి, కొనుగోలు అధికారి బాబు, ఏరియా అటవీ శాఖ అధికారి నవీన్, జీఎం కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే (ఐజేయూ) చేవెళ్ల ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా పడమటి నరేందర్ రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

### జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి కృషి చేస్తాం...

### సంఘం రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు సలీం పాషా, ఎలక్ట్రానిక్ మీడియా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చాకలి శ్రీశైలం పాల్గొన్నారు







**క్రైమ్ మిర్రర్ చేవెళ్ల, (అక్టోబర్ 9):** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) చేవెళ్ల నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా నూతన అధ్యక్షుడిగా పడమటి నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని వికారాబాద్ రోడ్డులో గల జీపీఆర్ ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీమ్ పాషా మాట్లాడుతూ.... జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా కృషి చేస్తామని, ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డులు కల్పించడం, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు సాధించడం కోసం పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం ఐక్యంగా పనిచేస్తూ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక:** చేవెళ్ల నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా పడమటి నరేందర్ రెడ్డి రాజ్ న్యూస్, ఉపాధ్యక్షులుగా గుత్తి శ్రీనివాసులు, బిగ్ టీవీ, గోంగుపల్లి రాఘవేందర్ 6టీవీ, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ టీవీ5, కార్యదర్శులుగా వామన్ రెడ్డి సాక్షి టీవీ, మహేష్ 99టీవీ, కోశాధికారిగా ఈపూరి రాఘవేంద్ర హెచ్ఎంటీవీ. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రవణ్ కుమార్ ప్రైమ్9, ఈసీ సభ్యులుగా ఇస్మాయిల్ 4టీవీ, రమేష్ 10టీవీ, శివ ఎన్24, సుధాకర్ స్టార్9, శివారెడ్డి ఇండియన్ టుడే, ముస్తఫా ఎన్ టీవీ, బిక్షపతి మహా న్యూస్, ఎన్నికయ్యారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంతోష్ ఏబీఎన్, జిల్లా కమిటీ ఈసీ మెంబర్ గా లంబాడి మల్లేష్ వి6, ఎంపికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పడమటి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన యూనియన్ నాయకులకు, జర్నలిస్టు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరినీ కలుపుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీశైలం, టీయూడబ్ల్యూజే చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు యాదయ్య, కార్యదర్శి గోపాల్, షాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ధర్పల్లి రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు కరుణాకర్ చారి, దర్శనాల కృష్ణ, సంతోష్ కుమార్ చారి, మల్లేష్ గోపాల్ రావు, వికారాబాద్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు కుమ్మరి రాఘవేందర్, వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. చేవెళ్ల నియోజకవర్గ రిపోర్టర్లు పూర్ణచందర్, రాజేష్, చంద్రశేఖర్, వినయ్‌తో పాటు పలువురు జర్నలిస్టులు హాజరయ్యారు.

# జీవో నెంబర్ 16 రద్దు చేయాలి

**ప్రత్యేకం పేరుతో హిందువులను నిలువు దోపిడీ చేస్తున్న ప్రభుత్వం.**

**బిజెపి రాష్ట్ర నాయకులు మర్రిపెల్లి సత్యమ్.**




**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** పండుగలకు ప్రత్యేక సందర్భాలలో యాభై శాతం బస్సు చార్జీలను పెంచుకునే విధంగా టి జి ఎస్ ఆర్ టి సి కి అధికారం ఇచ్చిన జీవో నెంబర్ 16ను వెంటనే రద్దు చేయాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రిపెల్లి సత్యమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నెల రోజుల క్రితం రాఖీ పౌర్ణమి సందర్భంగా స్పెషల్ బస్సుల పేరుతో తెలంగాణ ప్రభుత్వం ప్రజా రవాణాను వినియోగించుకునే ప్రయాణికులపై పెను భారం మోపిందని మళ్లీ ఇప్పుడు దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని దసరాకు పది రోజుల ముందు నుండి ప్రయాణికుల దగ్గర యాభై శాతం అదనపు బస్సు చార్జీలు వసూలు చేయడం దారుణమని అన్నారు. ముస్లింలు మక్కాకు పోవడానికి క్రైస్తవులకు బెత్లెహోం పోవడానికి విమానా ప్రయాణ చార్జీల్లో కోట్ల రూపాయలు రాయితీ ఇస్తున్న ప్రభుత్వం హిందువుల పండుగలకు మాత్రం ప్రత్యేకం పేరుతో ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తుందని సెక్యులరిజం అంటే ఇదేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలో వరుసగా హిందూ దేవాలయాలపై దాడులు జరిగితే నోరు తెరవని ప్రభుత్వం హిందువుల ఆలయాల నుండి హిందువుల పండుగల ద్వారా వచ్చే ఆదాయం కోసం మాత్రం వెంపర్లాడుతుందని అన్నారు. గతంలోబతుకమ్మ పండుగకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడపడుచుకు బతుకమ్మ చీరలు పంపిణీ జరిగిందని కానీ ప్రస్తుత ప్రభుత్వం కేవలం మహిళా సంఘ సభ్యులకు మాత్రమే పంపిణీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రంజాన్ కు ముస్లింలకు తెలంగాణ ప్రభుత్వం జరిపిన కుల గణనలో తెలంగాణ రాష్ట్రంలో ఒక్క క్రైస్తవ కుటుంబం లేదని కులగనన్న లెక్కలు చెప్తుంటే క్రిస్మస్ కు క్రైస్తవులకు బహుమతిగా కిట్లు పంపిణీ ఎందుకు చేస్తున్నారని కొత్త చర్చిల నిర్మాణానికి అనుమతులు ఎందుకు ఇస్తూ నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. హిందువులకు హిందు పండుగలకు ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. హిందూ మహిళలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడమే చేసిన పెద్ద నేరమా అని ఎద్దేవా చేశారు. ఎలాంటి షరతులు లేకుండా తెలంగాణలో ని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడపడుచుకు బతుకమ్మ చీరల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు .

# శంషీగూడ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ పండుగ సంబరాలు



**కూకట్ పల్లి, అక్టోబర్ 09 (క్రైమ్ మిర్రర్ ):** కూకట్ పల్లి మండల్ శంషీగూడ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ పండుగ సంబరాలు పాల్గొన్న ఉపాధ్యాయురాలు, ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు పిల్లలతో రంగు రంగు పూలతో బతుకమ్మలను తయారు చేయించి బతుకమ్మ పాటలను పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు, పిల్లలకు పాటలతో పాటు సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలిగేటట్లు అన్ని పండుగలను ఇదే విధంగా పాఠశాలలో జరుపుతామని తెలియజేశారు.

# కూకట్‌పల్లి నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ మొహమ్మద్ చన్ను పాషాకు ఘన సన్మానం

**కూకట్‌పల్లి, అక్టోబర్ 09 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ చైర్మన్‌గా నియమితులైన మొహమ్మద్ చన్ను పాషా శుక్రవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్‌లో బండి రమేష్ మొహమ్మద్ చన్ను పాషా కి శాలువా కప్పి, స్వీట్లు అందించి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మైనారిటీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు, పార్టీకి మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, నవాజ్ ,పాషా, అక్బర్, సచిన్, బర్కత్ అలీ, ప్రసన్న కుమార్, అస్లాం, పర్వేజ్, రమణ, ఖాజా, రమాదేవి, స్వరూప పాల్గొన్నారు.




# ఉర్రూతలూగించిన డేర్ కాలేజీ ఫ్రెషర్స్ డే





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** స్థానిక సత్యనారాయణపురం కొత్తూరు ఖమ్మం నగర శివారులో గల దరిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (బీటెక్ మరియు పాలిటెక్నిక్ డిప్లమా) నూతన విద్యార్థిని విద్యార్థుల స్వాగత వేడుకలు కళాశాల ఆవరణ యందు ఘనంగా నిర్వహించారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ, మోడర్న్ దుస్తుల్లో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే కార్యక్రమం అనేది సీనియర్ విద్యార్థులు ఎన్నో ఆశలతో, ఎన్నో లక్ష్యాలతో కొత్తగా వచ్చిన నూతన విద్యార్థిని విద్యార్థులకు ఒక పరిచయ వేదిక లాంటిదని, సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థిని విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని, వారి నుంచి మంచిని అనుసరించాలని, కొత్తగా వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. కష్టేఫలి అనగా కష్టపడిన ప్రతి విద్యార్థినీ విద్యార్థికి ఆశించిన ఫలితాలు వాటంతట అవే మన వద్దకి చేరుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన కళాశాల కరెస్పాండెంట్ మరియు వాణి ఐటిఐ ప్రిన్సిపల్ దరిపల్లి స్వాతి మాట్లాడుతూ శ్రీ దరిపల్లి అనంత రాములు గారు ఎన్నో విద్యా సంస్థలను నెలకొల్పి నేటికీ 44 సంవత్సరాలు పూర్తయింది, వారి ఆశీస్సుల వల్లే మనం ఈరోజు ఇక్కడ స్వాగత వేడుకలు చేసుకుంటున్నామంటే సార్ వారి సెలవేనని విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. జూనియర్ విద్యార్థిని విద్యార్థులకు సీనియర్ విద్యార్థిని విద్యార్థులు ఆదర్శంగా నిలవాలని మంచి మార్గదర్శి కావాలని, అంతేకాకుండా సీనియర్స్ ను జూనియర్స్ నీ మంచి లో అనుసరించి, అధ్యాపకుల ద్వారా ఉన్నత శిఖరాలను చేరాలని కోరారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అలువాల వెంకట్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని విద్యార్థి విద్యతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రాక్టికల్స్ ని శ్రద్ధతో చేయగలిగినప్పుడే నిజమైన లక్ష్యాలను చేరుకోవచ్చునని సూచించారు. కళాశాల వివిధ విభాగాల అధిపతులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కష్టపడి ఇష్టంగా చదవాలని తద్వారా ఉన్నత శిఖరాలను అవరోధించాలని తెలిపారు. డిప్లమా కోఆర్డినేటర్ ఉమారాణి మాట్లాడుతూ కళాశాలలో అన్ని మౌలిక వసతులను అందిపుచ్చుకొని తద్వారా నూతన ఆవిష్కరణ చేయాలని సీనియర్, జూనియర్ విద్యార్థిని విద్యార్థులకు అందరికీ సూచించారు. కళాశాల బీటెక్ కోఆర్డినేటర్ నీలిమ మాట్లాడుతూ ప్లేస్మెంట్ లక్ష్యంగా చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు క్యాంపస్ నందు క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ ద్వారా ఉపాధి అవకాశాన్ని మెరుగుపరుచుకోవచ్చునని నూతనంగా వచ్చిన విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు డా॥ జాన్ వెస్లీ, పుల్లయ్య, వెంకటరావు, రామ్ కుమార్, చంద్రకళ, విజయభవాని, ప్రియ, ప్రవీణ్, రెహమతి, ప్రసన్న మరియు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ నూతన స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర శివారులో గల దరిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (బీటెక్ మరియు పాలిటెక్నిక్ డిప్లమా) నూతన విద్యార్థిని విద్యార్థుల స్వాగత వేడుకలు కళాశాల ఆవరణ యందు ఘనంగా నిర్వహించారు.ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సంప్రదాయ, మోడర్న్ దుస్తుల్లో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే కార్యక్రమం అనేది సీనియర్ విద్యార్థులు ఎన్నో ఆశలతో, ఎన్నో లక్ష్యాలతో కొత్తగా వచ్చిన నూతన విద్యార్థిని విద్యార్థులకు ఒక పరిచయ వేదిక లాంటిదని, సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థిని విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని, వారి నుంచి మంచిని అనుసరించాలని, కొత్తగా వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. కష్టేఫలి అనగా కష్టపడిన ప్రతి విద్యార్థినీ విద్యార్థికి ఆశించిన ఫలితాలు వాటంతట అవే మన వద్దకి చేరుతాయని తెలియజేశారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన కళాశాల కరెస్పాండెంట్ మరియు వాణి ఐటిఐ ప్రిన్సిపల్ దరిపల్లి స్వాతి మాట్లాడుతూ శ్రీ దరిపల్లి అనంత రాములు గారు ఎన్నో విద్యా సంస్థలను నెలకొల్పి నేటికీ 44 సంవత్సరాలు పూర్తయింది, వారి ఆశీస్సుల వల్లే మనం ఈరోజు ఇక్కడ స్వాగత వేడుకలు చేసుకుంటున్నామంటే సార్ వారి సెలవేనని విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. జూనియర్ విద్యార్థిని విద్యార్థులకు సీనియర్ విద్యార్థిని విద్యార్థులు ఆదర్శంగా నిలవాలని మంచి మార్గదర్శి కావాలని, అంతేకాకుండా సీనియర్స్ ను జూనియర్స్ నీ మంచి లో అనుసరించి, అధ్యాపకుల ద్వారా ఉన్నత శిఖరాలను చేరాలని కోరారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అలువాల వెంకట్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని విద్యార్థి విద్యతోపాటు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రాక్టికల్స్ ని శ్రద్ధతో చేయగలిగినప్పుడే నిజమైన లక్ష్యాలను చేరుకోవచ్చునని సూచించారు. వివిధ విభాగాల అధిపతులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కష్టపడి ఇష్టంగా చదవాలని తద్వారా ఉన్నత శిఖరాలను అవరోధించాలని తెలిపారు. డిప్లమా కోఆర్డినేటర్ ఉమారాణి మాట్లాడుతూ కళాశాలలో అన్ని మౌలిక వసతులను అందిపుచ్చుకొని తద్వారా నూతన ఆవిష్కరణ చేయాలని సీనియర్, జూనియర్ విద్యార్థిని విద్యార్థులకు అందరికీ సూచించారు. కళాశాల బీటెక్ కోఆర్డినేటర్ నీలిమ మాట్లాడుతూ ప్లేస్మెంట్ లక్ష్యంగా చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు క్యాంపస్ నందు క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ ద్వారా ఉపాధి అవకాశాన్ని మెరుగుపరుచుకోవచ్చునని నూతనంగా వచ్చిన విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు డా॥ జాన్ వెస్లీ, పుల్లయ్య, వెంకటరావు, రామ్ కుమార్, చంద్రకళ, విజయభవాని, ప్రియ, ప్రవీణ్, రెహమతి, ప్రసన్న మరియు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ నూతన స్వాగత వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లలో వీధిలైట్ల సమస్యను పరిష్కరించండి

**చీకట్లో ప్రజల అవస్థలు.. అధికారుల నిర్లక్ష్యంపై ఎస్. వెంకటేష్ ఆగ్రహం**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలో వీధిలైట్లు పనిచేయకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు వీధిలైట్ల సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బెంగళూరు జాతీయ రహదారి నుంచి శిరాంపల్లి రైల్వే గేటు మీదుగా బాబులురెడ్డి నగర్ వరకు వీధిలైట్లు సరిగా వెలగకపోవడంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంకటేష్ తెలిపారు. చీకటి కారణంగా ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఆందోళనకు గురవుతున్నారని, రహదారులపై ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, చీకటిని ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను గతంలోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించలేదని ఆయన ఆరోపించారు. స్తంభాలపై ఉన్న వీధిలైట్లకు మరమ్మతులు చేపట్టినా సమస్య కొంతవరకు పరిష్కారమవుతుందని, అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకవైపు బతుకమ్మ, దేవీ నవరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో, మరోవైపు ప్రజలు తమ కాలనీల్లో వీధిలైట్లు లేక ఇబ్బందులు పడటం విచారకరమని వెంకటేష్ వ్యాఖ్యానించారు. పండుగల సమయంలో రాత్రివేళల్లో ప్రజల రాకపోకలు పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. నగర కార్పొరేషన్ అధికారులు కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, పనిచేయని వీధిలైట్లను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. మరమ్మతులకు వీలున్న లైట్లను వెంటనే బాగుచేయడంతో పాటు, పూర్తిగా పనిచేయని వాటి స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎస్. వెంకటేష్ తెలిపారు. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి వీధిలైట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు.

# బాలానగర్‌లో నేడు ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

**మహిళలందరూ పాల్గొని బతుకమ్మ పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి**



**బాలానగర్, అక్టోబర్ 09 (క్రైమ్ మిర్రర్) :** బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నేడు సాయంత్రం 5 గంటలకు బాలానగర్ దుర్గామాత ఆలయం సమీపంలో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు హాజరై బతుకమ్మ సంబరాల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్‌లోని మహిళలు, బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని ఆవుల రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో మహిళలు స్థానికంగా లభించే వివిధ రకాల పూలను అందంగా పేర్చి బతుకమ్మలను తయారు చేసి, సాయంత్రం వేళ బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. బతుకమ్మలో ఉపయోగించే పూలు, ఆకులు ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని, తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయి. మహిళల సాంస్కృతిక, సామాజిక పాత్రను చాటిచెప్పే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ఈ బతుకమ్మ సంబరాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనాలని, వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు ఆవుల రవీందర్ రెడ్డి తెలిపారు.బాలానగర్ డివిజన్ మహిళలందరూ తమ తమ బతుకమ్మలతో విచ్చేసి, ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు.

# ప్రొబేషనరీ డీఎస్పీలతో సైబరాబాద్ కమిషనర్ డాక్టర్ రమేష్‌రెడ్డి ఇంటరాక్షన్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీలతో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్‌రెడ్డి శుక్రవారం ఇంటరాక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ అనంతరం జిల్లా ప్రాక్టికల్ ట్రై నింగ్లో నేర్చుకోవాల్సిన అంశాలు, పోలీస్ విభాగంలోని వివిధ విభాగాల విధులు, ఎస్‌హెచ్‌వో, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, డివిజనల్ ఆఫీసర్‌గా బాధ్యతల నిర్వహణపై ఆయన వివరించారు. రానున్న 35 ఏళ్ల పోలీస్ సర్వీసులో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చట్టాలను సమర్ధవంతంగా అమలు చేస్తూ, వృత్తి నైపుణ్యంతో విధులు నిర్వహించాలని ట్రై నీ అధికారులకు సూచించారు. తన ప్రాక్టికల్ పోలీసింగ్ అనుభవాలను పంచుకుంటూ, ట్రై నీ అధికారుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డైరెక్టర్ వేమా శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీ వి.భాస్కర్, ట్రై నీ అధికారులు పాల్గొన్నారు.



# సంఘమిత్ర స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పిన విద్యార్థులు

గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ 123వ డివిజన్ పరిధిలోని గంధంగూడలో ఉన్న శ్రీ సంఘమిత్ర స్కూల్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ పాటలు, ఆటలతో పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నార్సింగి మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్ హాజరయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేస్తూ తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించారు. చిన్నారులకు పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు, మన సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థుల



ఉత్సాహం, సంప్రదాయ వస్త్రధారణ, బతుకమ్మల అలంకరణతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి.



# సీఎం సహాయ నిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నాం

## రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** సీఎం సహాయ నిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ప్రేమావతిపేటకు చెందిన కామటి రాజుకు శాస్త్ర చికిత్స నిమిత్తం 1.50 లక్షల ఖర్చు అవుతుండడంతో స్థానిక నాయకుడు పెండ్యాల సాయిమాలిక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి విన్నవించారు. దీంతో ఆయన సానకూలంగా స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం 1.50 లక్షల నిధులను మంజూరు చేయించి ఎల్‌వోసి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారుతుందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో అనేక మందికి సీఎం సహాయ నిధి ద్వారా ఆదుకోవడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత మందిని ఆదుకునేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పడమటి శ్రీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పెండ్యాల సాయి మాలిక్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న సామ రామ్మోహన్ రెడ్డి శుక్రవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని సామ రామ్మోహన్ రెడ్డి ఎమ్మెల్యేను కోరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రుల ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని పట్టభద్రులకు తన అభ్యర్థిత్వాన్ని పరిచయం చేయడంతో పాటు, వారి మద్దతుతో ఎన్నికల్లో విజయం సాధించేలా సహకరించాలని కోరినట్లు తెలిపారు. ఈ భేటీ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకుంది.

## న్యాయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు నల్సార్--ఆర్‌బీవీఆర్ఆర్

# తెలంగాణ పోలీస్ అకాడమీ మధ్య అవగాహన ఒప్పంద



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పోలీసు అధికారుల్లో న్యాయ పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించడంతో పాటు వారి వృత్తిపరమైన నైపున్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ మధ్య అవగాహన ఒప్పంద కుదిరింది. హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీ ఏకశిల భవనంలోని రూమ్ నంబర్ 304లో శుక్రవారం ఉదయం అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, నల్సార్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీకష్ణ దేవరావు సమక్షంలో ఈ అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా పోలీస్ అధికారులకు చట్టాలు, న్యాయపరమైన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, వారి వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగు పరిచే విధంగా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను రూపొందించేందుకు ప్రణాళిక రూపొందించారు. ముఖ్యంగా పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఇండక్షన్ ట్రై నీ ఆఫీసర్లకు న్యాయపరమైన అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటుసంబంధిత కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన వారికి న్యాయ విద్యకు సంబంధించిన సర్టిఫికెట్ అందించే విధంగా కార్యక్రమాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత నేర పరిశోధన, చట్టాల అమలు, న్యాయ ప్రక్రియలు, కేసుల దర్యాప్తు వంటి అంశాల్లో పోలీస్ అధికారులు మరింత నైపుణ్యాన్ని సాధించేందుకు ఈ భాగస్వామ్యం దోహద పడనుంది. చట్టపరమైన అవగాహన పెంపొందించడం ద్వారా పోలీస్ అధికారులు తమ విధులను మరింత సమర్ధవంతంగా, చట్టబద్ధంగా నిర్వహించేం దుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. ఈ అవగాహన ఒప్పందం కార్యక్రమంలో డైరెక్టర్, నల్సార్ వైస్ చాన్సలర్‌తో పాటు నల్సార్ ప్యాకల్టీ డాక్టర్ బాలకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్లు కవిత, వెంకటేశ్వర్లు, కెఆర్‌కె ప్రసాద్‌లు ఏడిలు, డిఎస్‌పిలు, లా ఫ్యాకల్టీ వరలక్ష్మిలు పాల్గొన్నారు.

# వరకట్న వేధింపుల కేసులో ముగ్గురికి ఏడేళ్ల జైలు శిక్ష




సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 09: వరకట్న మరణం కేసులో ముగ్గురు నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సంగారెడ్డిలోని ఫ్యామిలీ కోర్టు కమ్ ×ం అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎం. సతీష్ కుమార్ తీర్పు వెలువరించారు.జహీరాబాద్ పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీకి చెందిన పసుల నికితకు 2021 మే 16న పసుల సాయికుమార్‌తో వివాహమైంది. అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు మానసికంగా, శారీరకంగా వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2022 ఫిబ్రవరి 15న నికిత తన నివాసంలో మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు జహీరాబాద్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరచగా, విచారణ అనంతరం ముగ్గురికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. శిక్ష పడిన వారిలో మృతురాలి భర్త పసుల సాయికుమార్, మామ యాదప్ప, అత్త అనసూయ ఉన్నారు. కేసు విచారణలో సమర్థవంతంగా పనిచేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.



# సంస్కృతి పాఠశాలలో సంబురం గా బతుకమ్మ పండుగ



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 09 (క్రైమ్ మిర్రర్): జగద్గిరిగుట్ట లోని సంస్కృతి పాఠశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. తిరొక్క పువ్వులతో బతుకమ్మ పేర్చి చిన్నారులు అడిపాడారు. బతుకమ్మ పాటలతో, కోలాటలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. అనంతరం బతుకమ్మలను బతుకమ్మ కుంటలో వేసి పోయిరావమ్మా గౌరమ్మ లాంటి పాటలతో సాగనంపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి విద్యానికేతన్ హైస్కూల్‌లో ఘనంగా మాతృపితృ వందన కార్యక్రమం



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 09 (క్రైమ్ మిర్రర్):** "విలువల నిర్మాణమే జాతి నిర్మాణం జగద్గిరిగుట్ట లోని శ్రీ సాయి విద్యానికేతన్ హైస్కూల్‌లో శుక్రవారం మాతృపితృ వందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇనిషియేటివ్ ఫర్ మోరల్ అండ్ కల్చరల్ ట్రైనింగ్ ఫౌండేషన్ (IMCTF) ,సౌజన్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో తల్లిదండ్రులకు ఉన్న విశిష్ట స్థానాన్ని తెలియజేస్తూ, విద్యార్థుల్లో తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం, కృతజ్ఞతాభావాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పాఠశాల కరెస్పాండంట్ బిర్రు ఆంజనేయులు తెలిపారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు విద్యా పరిజ్ఞానంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సంస్కారం, మానవీయత కూడా అవసరమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదాభివందనం చేసి, వారి ఆశీర్వాదాలను పొందారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా లింగస్వామి యాదవ్



**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని లింగోజీగూడెం గ్రామానికి చెందిన ఎర్రగోని లింగస్వామి యాదవ్‌ను చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ విప్,డీసీసీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు.పార్టీ కోసం లింగస్వామి యాదవ్ చేసిన కృషిని గుర్తించి, ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు పార్టీ పెద్దలు, నాయకులకు లింగస్వామి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

# మణికొండలో వన్ వార్డ్ -- వన్ డేపై కాంగ్రెస్ నేత జితేందర్ మెరుగు ప్రశ్నలు

## తమ పార్టీకి సమాచారం ఇవ్వలేదని ఆరోపణ.. అధికారుల స్పందనకు డిమాండ్



గండిపేట(క్రైమ్ మిర్రర్): మణికొండ డివిజన్‌లో అక్టోబర్ 3న నిర్వహించిన వన్ వార్డ్ -- వన్ డే కార్యక్రమంపై కాంగ్రెస్ నాయకుడు జితేందర్ మెరుగు పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ కార్యక్రమం గురించి తమ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ముందస్తు సమాచారం అందలేదని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే కార్యక్రమాల్లో అన్ని రాజకీయ పార్టీలకు సముచిత సమాచారం అందించి, భాగస్వాములను చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం గురించి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సహచరులను వ్యక్తిగతంగా అడిగి తెలుసుకున్నానని, వారిలో ఎవరికీ సమాచారం లేదని తెలిపారని జితేందర్ మెరుగు పేర్కొన్నారు. ఇతర పార్టీలను కార్యక్రమాలకు ఆహ్వానించడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ప్రజాస్వామ్య స్ఫూర్తితో అన్ని పార్టీలను కలుపుకొని ప్రజా సమస్యలను పరిష్కరించడాన్ని స్వాగతిస్తామని స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీకి పదేపదే సమాచారం అందకపోవడంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో సర్కిల్ స్థాయి అధికారి పర్యటన సమయంలోనూ ఇలాంటి పరిస్థితి ఎదురైందని ఆయన ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నప్పటికీ, వాటిని బహిరంగంగా వెల్లడించలేదు. వరుసగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాల నేపథ్యంలో కార్యక్రమాల నిర్వహణలో రాజకీయ పక్షపాతం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణ వెలువడాల్సి ఉంది. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, సంబంధిత జోనల్ అధికారిని ఉద్దేశించి జితేందర్ మెరుగు ప్రశ్నలు సంధించారు. మణికొండతో పాటు 127, 128 డివిజన్లలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాల సమాచారం అన్ని పార్టీలకు సమానంగా అందుతోందా? కాంగ్రెస్ నాయకులను ఎందుకు కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం లేదని ఆరోపణలు వస్తున్నాయి? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రజా ప్రభుత్వంలో రాజకీయ పార్టీల మధ్య వివక్షకు తావుండకూడదని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రకటిస్తున్న ప్రజా పాలన స్ఫూర్తి క్షేత్రస్థాయిలోనూ ప్రతిబింబించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రతికూల ప్రచారానికి ఆస్కారం కలగకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని జితేందర్ మెరుగు సూచించారు. వన్ వార్డ్ -- వన్ డే వంటి కార్యక్రమాల వివరాలను ముందుగానే సంబంధిత ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులకు తెలియజేస్తే ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత సమన్వయం సాధ్యమవుతుందని అన్నారు. మణికొండలో కార్యక్రమాల నిర్వహణపై తలెత్తిన ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై అధికారుల స్పందన, కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన వివరాలు వెల్లడైతే వివాదానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# బాయికాడి విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాద్రి పృథ్వీరాజ్



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 09: పటాన్‌చెరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాయికాడి విజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతున్న బాయికాడి విజయ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయన చేపట్టే ప్రతి కార్యక్రమంలో విజయం సాధించాలని మాద్రి పృథ్వీరాజ్ ఆకాంక్షించారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 శనివారం 10-10-2026

# మైలార్ దేవ్ పల్లి హరిజనవాడ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## విద్యార్థులే స్వయంగా బతుకమ్మల తయారీ.. పాటలతో సందడిగా వేడుకలు





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాజేంద్రనగర్ మండలం మైలార్ దేవ్ పల్లి హరిజనవాడ ఎంపీపీఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా బతుకమ్మలను తయారు చేసి, బతుకమ్మ పాటలకు ఉత్సాహంగా ఆడుతూ పండుగ సంబరాలను జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు బాలకృష్ణ మదగని ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతిలో దాని ప్రాధాన్యం, ప్రకృతితో ముడిపడిన పండుగ సంప్రదాయాల గురించి ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను పల్లెచెరువులో నిమజ్జనం చేశారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో మన సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు ఐక్యత, సామూహిక భాగస్వామ్య భావనను పెంచుతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధారాణి, శ్రావణి, సుజాత, అక్తర్ బేగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మదగని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి విద్యార్థుల నమోదు, ఉపాధ్యాయుల సర్దుబాటు వంటి అంశాలతో పాటు పాఠశాల నిర్వహణలో ఉపాధ్యాయులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎస్, యు-డైస్ , పిల్లల వివరాలు, ఎం డిఎం, ఎ ఎక్స్ ఎల్, అపార్, స్పర్శ, టిస్ ఆన్‌లైన్, దీక్ష వంటి వివిధ విద్యా పోర్టళ్లు, ఆన్‌లైన్ నివేదికలు, డేటా ఎంట్రీలు, బయోమెట్రిక్ వెరిఫికేషన్లు, అసైన్‌మెంట్లు, పాఠ్య ప్రణాళికలు, వార్షిక ప్రణాళికలు, కాంప్లెక్స్ సమావేశాలు, తనిఖీల వంటి అనేక బాధ్యతలను ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారని తెలిపారు. బోధనేతర పనుల భారం పెరుగుతున్నప్పటికీ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. పరిపాలనా బాధ్యతల మధ్య కూడా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారికి అవసరమైన సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. బతుకమ్మ, దసరా పండుగలు ఉపాధ్యాయుల జీవితాల్లో ఆనందాన్ని నింపాలని, విద్యార్థుల అభ్యున్నతికి మరింత ఉత్సాహంతో పనిచేసే శక్తిని అందించాలని బాలకృష్ణ మదగని శుభాకాంక్షలు తెలిపారు.

# ట్యాంక్ బండ్ పై దొడ్డి కొమురయ్య విగ్రహం పెట్టాలి : కుండె వెంకటేష్



మునుగోడు క్రైమ్ మిర్రర్ : కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.హైదరాబాద్ ట్యాంక్ బండ్ మీద దొడ్డి కొమురయ్య విగ్రహం పెట్టి,వరంగల్ ఎయిర్పోర్ట్ కు దొడ్డి కొమరయ్య పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.లేని యెడల కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతమని హెచ్చరించారు.

## ఖానాపూర్‌లో నో బిన్ -- నో ట్రేడ్ పై అవగాహన

### వ్యాపార సంస్థల్లో తడి, పొడి చెత్తకు వేర్వేరు బిన్లు ఏర్పాటు చేయాలి




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పరిసరాల పరిశుభ్రతను కాపాడటంతో పాటు చెత్త నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేసే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నో బిన్ -- నో ట్రేడ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. శుక్రవారం నార్సింగి సర్కిల్ పరిధిలోని గండిపేట మండలం, 126వ వార్డు ఖానాపూర్ గ్రామంలో వ్యాపారులకు ఈ కార్యక్రమంపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రతి వ్యాపార సంస్థలో తడి చెత్త, పొడి చెత్త సేకరణకు రెండు వేర్వేరు డస్ట్‌బిన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హానికర వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా వేరు చేసి నిర్వహించాలని వివరించారు. దుకాణాలు, వ్యాపార ప్రాంగణాల పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా, ఉత్పత్తి అయిన చోటే తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని వ్యాపారులకు అవగాహన కల్పించారు. చెత్తను మూలస్థాయిలోనే వేరు చేయడం ద్వారా వ్యర్థాల సేకరణ, తరలింపు, శాస్త్రీయ నిర్వహణ సులభతరమవుతుందని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు ప్రజారోగ్యానికి ఎంతో కీలకమని, మున్సిపల్ సిబ్బందికి సహకరిస్తూ ప్రతి వ్యాపారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. 'నో బిన్ -- నో ట్రేడ్' కార్యక్రమం ద్వారా వ్యాపార సంస్థల్లో క్రమబద్ధమైన చెత్త నిర్వహణను ప్రోత్సహిస్తూ పరిశుభ్రమైన గ్రామం, ఆరోగ్యకరమైన సమాజం దిశగా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని నార్సింగి సర్కిల్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

# సాగునీరు కోసం మునుగోడులో క్యాండిల్ నిరసన ర్యాలీ

### పాలమూరు--రంగారెడ్డి కాలువతో సమాన లెవల్‌లో డిండి కాలువను నిర్మించాలి!

మునుగోడు క్రైమ్ మిర్రర్ : నల్గొండ జిల్లా ప్రజలకు నీటిపై స్పష్టమైన హామీ ఇవ్వాలి డిండి ఎత్తిపోతల పథక సాధన సమితి డిమాండ్ చేశారు.నల్గొండ జిల్లా మునుగోడు, దేవరకొండ, నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో కీలకమైన డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుల (వీరాంజనేయ) జలాశయం నుంచే నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ, మునుగోడు చౌరస్తాలో రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.డిండి కాలువకు 440 అడుగుల ఎత్తును ప్రతిపాదించడం వల్ల భవిష్యత్తులో ప్రాజెక్టు నీటి సరఫరాపై సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.దశాబ్దాలుగా సాగునీటి వసతులు లేక, తాగునీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మునుగోడు, దేవరకొండ ప్రాంతాల ప్రజలకు డిండి ఎత్తిపోతల పథకం ఎంతో కీలకమని సమితి పేర్కొంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైతులకు సాగునీరు అందడంతో పాటు, ప్రజలకు, పశువులకు నీటి లభ్యత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.ఈ నెల 14వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న పాలమూరు--రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల సమీక్ష సమావేశంలో నల్గొండ జిల్లా ప్రజల నీటి అవసరాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిండి ఎత్తిపోతల పథక సాధన సమితి డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఉద్యమని ఉధృతం చేస్తామని స్పష్టం చేసింది .సర్పంచ్ నకిరేకంటి మురళీకృష్ణ, పాలగొని సైదులు,గజ్జెల బాలరాజు, మారగోని అంజయ్య గౌడ్,మేకల శ్రీనివాస్ రెడ్డి,జిట్టగొని మల్లేష్ యాదవ్,అయితగొని విజయ్ గౌడ్, గురిజ సునీల్, బైరు నరేష్,గుర్రాల సురేష్,సురేందర్,అంజయ్య, సురిగి లింగస్వామి, రవి, సర్పంచులు,వివిధ గ్రామస్తులు పాల్గొన్నారు.




# శాస్త్రిపురం బమ్రుకుందౌల పార్కును శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత స్థానికులదే

### జోన్ పరిధిలో పారిశుధ్యం, ప్రాజెక్ట్స్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించిన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడానికి కోట్లాది రూపాయలతో నిర్మాణం చేసిన శాస్త్రిపురం బమ్రుకుందౌల పార్కు ను స్థానికులే కాపాడుకోవాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన బహదూర్ పుర, అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు, జీ హెచ్ ఎం సీ ఎస్ ఈ, ఈ ఈ, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ విభాగం అధికారులతో కలిసి చాంద్రాయణ గుట్ట, బహదూర్ పుర, అత్తాపూర్ సర్కిళ్లలో పర్యటించారు. ప్రతిరోజు పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. రోడ్లపై ఎక్కడ చెత్త ఉండకూడదు అన్నారు. బండ్లగూడ, చాంద్రాయణ గుట్ట ప్రాంతాల్లో జరుగుతున్న ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

**పార్కు పరిసరాలు బాగుండేలా చూడాలి...**

శాస్త్రిపురం లోని బమ్రుకుందౌల పార్కు నిర్వాణ ను హైడ్రా జీహెచ్ ఎంసీ కి అప్ప చెప్పిందని తెలిపారు. పార్కులో చెత్త వేస్తున్నారని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మార్నింగ్ వాకర్స్ కు సూచించారు. పక్కనే ఉన్న నివాసాల వారు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారని, అలా చేయకూడదన్నారు. పార్కును పరిశుభ్రంగా ఉంచుకోవడం స్థానికులది, పార్కు కు వచ్చే సందర్శకులదే అని సూచించారు. భవిష్యత్తులో స్థానికులతో ఒక కమిటీ వేసి పార్కు నిర్వహణ బాధ్యత వారికే అప్ప చెప్పడం జరుగుతుందని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఆహ్లాదకరమైన వాతావరణం ను కల్పించడానికి ఏర్పాటు చేసిన పార్కు ను పాడు చేసుకోవద్దన్నారు. జోనల్ కమిషనర్ వెంట రాజేంద్రనగర్ జోనల్ ఎస్ ఈ నరేందర్ గౌడ్, రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్ పుర సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు బి సురేందర్ రెడ్డి, లోకపెద్ద మల్లారెడ్డి, అరుణ కుమారి, ఈ ఈ భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# కుల్కచర్లలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ -- విస్తృత తనిఖీలు

### 107 మంది పోలీసు సిబ్బందితో తనిఖీలో 54 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 34 లీటర్ల మద్యం స్వాధీనం. ఇద్దరు రౌడీషీటర్ల తనిఖీ





క్రైమ్ మిర్రర్ కల్కచర్ల:వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణ, ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడం,శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా శుక్రవారం (09-10-2026) తెల్లవారుజామున వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు.పరిగి డీఎస్పీ శ్రీ ఎన్. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఉదయం 5:00 గంటల నుంచి 7:00 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 107 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కుల్కచర్ల గ్రామంలోని అంగడి బజార్ ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ ఇళ్ల తనిఖీలు, వాహనాల తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికల పరిశీలన వంటి ముందస్తు నేర నియంత్రణ చర్యలు చేపట్టారు.

**తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నవి:** 54 ద్విచక్ర వాహనాలు: వాహనాల పత్రాలు, సంబంధిత వివరాలను పరిశీలించే క్రమంలో స్వాధీనం చేసుకున్నారు.2 ఆటోలు: వాహనాల తనిఖీల్లో భాగంగా స్వాధీనం చేసుకున్నారు.34 లీటర్ల మద్యం: తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్నారు.ఇద్దరు రౌడీషీటర్ల తనిఖీ: నేర నియంత్రణ చర్యల్లో భాగంగా ఇద్దరు రౌడీషీటర్లను తనిఖీ చేసి, వారి వివరాలను పరిశీలించారు.ఈ తనిఖీల ద్వారా నేరాలకు అవకాశం కల్పించే పరిస్థితులను ముందుగానే గుర్తించడం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతలను కాపాడడం వంటి అంశాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.ఈ సందర్భంగా పరిగి డీఎస్పీ శ్రీ ఎన్. శ్రీనివాస్, మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామాలు, ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు, నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించడం సులభమవుతుందని డీఎస్పీ వివరించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించడం, పోలీసు--ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, నేరాల నివారణలో ప్రజలను భాగస్వాములను చేయడం, అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడం ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, పరిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండల్ రెడ్డి, కుల్కచర్ల, పరిగి, చెంగోముల్, దోమ, కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, 12 మంది మహిళా పోలీసు కానిస్టేబుళ్లు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అఖిలపక్ష సమావేశం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల పురపాలక సంఘం పరిధిలో దసరా పండుగ సందర్భంగా జరిగే సెలవులను అధికారులు ఖరారు చేశారు. అక్టోబర్ 9న పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ పందిరి గీత రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.అక్టోబర్ 10న శనివారం శరన్నవరాత్రుల ప్రారంభం, అక్టోబర్ 18న ఆదివారం సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 20న మంగళవారం విజయదశమి పండుగల సందర్భంగా సెలవులు ప్రకటించారు.ఈ సమావేశంలో పురపాలక సంఘ కమిషనర్, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

# రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి

### ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి



**నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 09:** నియోజకవర్గంలోని రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఎస్ఈ అధికారితో మాట్లాడి రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను వివరించారు.ప్రస్తుతం రోజుకు 6 నుంచి 7 గంటలే విద్యుత్ సరఫరా అవుతుండటంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

# బదిలీపై వెళుతున్న ఎస్‌బీఐ మేనేజర్‌కు సన్మానం చేసిన దైద రవీందర్



**నకిరేకల్ క్రైమ్ మిర్రర్ :** నకిరేకల్ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ లలితాదేవి బదిలీపై వెళుతుండగా, ఆమె అందించిన సేవలకు కృతజ్ఞతగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ శాలువాతో సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన బ్యాంక్ మేనేజర్ మధును కూడా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నామిరెడ్డి కృష్ణారెడ్డి, కోటగిరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణ, నాణ్యమైన దర్యాప్తు

## నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలి.. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో, జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ, కోర్టు కేసుల పరిష్కారం, ఈ-సాక్ష్య, ఈ-సమ్మన్స్ అమలు, నిందితులకు శిక్షలు పడేలా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, నేరాల నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల తీరును విశ్లేషిస్తూ, నేరాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షిస్తూ, ప్రతి కేసులో దర్యాప్తు పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, ఆస్తి సంబంధిత నేరాలు, మహిళలు పిల్లలపై నేరాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో ఈ-సాక్ష్య విధానాన్ని నిబంధనల ప్రకారం, సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్పీ సూచించారు. నేర స్థలంలో లభించే ఆధారాలు, ఫోటోలు, వీడియోలు, ఇతర కీలక సాక్ష్యాలను చట్టబద్ధమైన విధానంలో సేకరించి భద్రపరచాలని, సాక్ష్యాల సేకరణలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని తెలిపారు. సాక్ష్యాధారాల్లో లోపాల కారణంగా నిందితులు శిక్షల నుంచి తప్పించుకునే పరిస్థితులు రాకుండా, దర్యాప్తు అధికారులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఫోరెన్సిక్ ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీ, డిజిటల్ ఆధారాలను కేసు స్వభావానికి అనుగుణంగా వినియోగించుకోవాలని తెలిపారు. కోర్టుల నుంచి జారీ అయ్యే సమన్లు, వారెంట్ల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఎస్పీ పవార్ ఆదేశించారు. ఈ-సమ్మన్స్ ప్రక్రియను నిబంధనల ప్రకారం అమలు చేస్తూ, సంబంధిత వ్యక్తులకు సమన్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, వాటి అమలు వివరాలను ఎలక్ట్రానిక్ విధానంలో నమోదు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్లను గుర్తించి, నిందితులను చట్టప్రకారం కోర్టు ముందు హాజరుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. కోర్టుల్లో విచారణలో ఉన్న కేసులపై దర్యాప్తు అధికారులు నిరంతరం దృష్టి సారించాలని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం చేసుకుంటూ, కేసుల విచారణను సమర్థవంతంగా






ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. సాక్షులు విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, చార్జిషీట్లు, సాక్ష్యాధారాలు, ఇతర అవసరమైన పత్రాలను సక్రమంగా సిద్ధం చేయాలని తెలిపారు. నాణ్యమైన దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల సమర్పణ ద్వారా నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్, వాహనాల చోరీలు, ఇతర ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఎస్పీ సూచించారు. గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలను పర్యవేక్షిస్తూ, అనుమానితులపై నిఘా కొనసాగించాలని తెలిపారు. నేరం జరిగిన వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారం ఆధారంగా నిందితులను త్వరితగతిన గుర్తించాలన్నారు. దొంగిలించిన ఆస్తిని రికవరీ చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

మహిళలు, బాలికలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో అధికారులు సత్వరమే స్పందించాలని ఎస్పీ సూచించారు. బాధితుల ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని తెలిపారు. పోక్సో కేసుల్లో నిర్ణీత కాలపరిమితిని దృష్టిలో ఉంచుకొని దర్యాప్తును వేగవంతం చేయాలని, బాధితులకు అవసరమైన రక్షణ, సహాయ సహకారాలు అందేలా చూడాలని ఆదేశించారు. మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, షీటీమ్స్ ద్వారా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు, ఓటీపీ మోసాలు, యూపీఐ, క్యూఆర్ కోడ్ మోసాలు, నకిలీ పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో మోసాలు వంటి సైబర్ నేరాల పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ తెలిపారు. సైబర్ మోసానికి గురైన బాధితులు ఆలస్యం చేయకుండా, వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, ఌఎవతీఌతీఅఎవ.ౠశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. నమోదైన సైబర్ నేరాల దర్యాప్తులో బ్యాంకులు, సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకుంటూ మోసపోయిన నగదును నిలిపివేసేందుకు, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. అనుమానిత ప్రాంతాలను గుర్తించి తనిఖీలు నిర్వహించాలని, విద్యా సంస్థల పరిసరాల్లో మాదకద్రవ్యాల ప్రభావం పెరగకుండా, ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల సరఫరా గొలుసును గుర్తించి, ప్రధాన నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా, అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని ఎస్పీ సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, అతివేగం, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించేవారు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు భద్రతపై వాహనదారులు, విద్యార్థులు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై నిఘా కొనసాగించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్‌ను బలోపేతం చేయాలని ఎస్పీ పవార్ తెలిపారు. రాత్రి పెట్రోలింగ్, వాహనాల తనిఖీలు, చెక్‌పోస్టుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలను పర్యవేక్షిస్తూ, నేరాలకు పాల్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చట్టాన్ని సమానంగా అమలు చేస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజల ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై చట్టప్రకారం స్పందించాలని ఎస్పీ సూచించారు. బాధితుల సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ,రమేష్, డీఎస్పీలు, శివరాం రెడ్డి, రవి, శ్రీనివాస రావు, సీఐలు, ఎస్ఐలు, ఇతర సంబంధిత పోలీస్ అధికారులు పాల్గొన్నారు.




## బంజారాహిల్స్‌లో కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు

గండిపేట(క్రైమ్ మిర్రర్): హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయంలో మాన్యవర్ సాహెబ్ కాన్షీరాం వర్ధంతి సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు పూజారి ప్రవీణ్ మాట్లాడుతూ, బహుజనుల హక్కుల సాధన, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల రాజకీయ చైతన్యం కోసం మాన్యవర్ కాన్షీరాం గారు చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, సమాన అవకాశాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాన్షీరాం గారి ఆశయాలను భావితరాలకు అందించడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ సీనియర్ న...

## రాజేంద్రనగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

### రూ.2.51 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం..

### శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని భవానీ కాలనీ, ప్రేమావతిపేట ప్రాంతాల్లో రూ.2.51 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. జీహెచ్ఎంసీ డివిజన్ నంబర్ 120, సర్కిల్-19 పరిధిలోని పలు అంతర్గత వీధుల్లో ఈ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కాలనీల్లో రహదారుల సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంలో భాగంగా ఈ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. అంతర్గత రహదారులు మెరుగుపడితే స్థానికులు, వాహనదారుల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది. రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## పువ్వులను దేవతల లాగా పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణకే ప్రత్యేకం

**బతుకమ్మ వేడుకల ద్వారా ఈ తరం పిల్లలకు మన పండుగల గొప్పతనాన్ని సాంప్రదాయాలను సంస్కృతులను తెలియజేయడం మంచి పరిణామం**

**చౌటుప్పల్ బ్రతుకమ్మ వేడుకల్లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి**



**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలో ట్రినిటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 30 అడుగుల భారీ బతుకమ్మను ఏర్పాటు చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి హాజరై విద్యార్థులతో కలిసి ఆడి పాడారు, మహిళలందరూ ఒకచోట చేరి భక్తిశ్రద్ధలతో బతుకమ్మను సెలబ్రేట్ చేసుకోవడం, పూలను దేవతలా భావించి పూజించడం తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమన్నారు... మన పూర్వీకులు మనకు ఇచ్చిన సంస్కృతి సాంప్రదాయాలను ఈ తరం తెలియజేసేలా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం సంతోషకరమన్నారు.. ప్రతి ఒక్కరూ ఈ దసరా సెలవుల్లో గ్రామాలకు వెళ్లి నానమ్మ అమ్మమ్మ లు చెప్పే ప్రతి విషయాన్ని తెలుసుకోవాలని విద్యార్థినులను ఉద్దేశించి అన్నారు...దేవుడిచ్చిన శక్తితో మా ఊపిరి ఉన్నంతవరకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా సమాజానికి పేద ప్రజలకు సహాయం చేస్తూనే ఉంటామని పునరుద్ఘాటించారు... ఈ బతుకమ్మ వేడుకల్లో కోమటిరెడ్డి లక్ష్మి గారితో పాటు చౌటుప్పల్ మున్సిపల్ పాలకవర్గ మహిళలు, పుర మహిళలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు...



## రామప్ప దేవాలయంను సందర్శించిన సీనినటుడు చంద్రశేఖర్

**వెంకటాపూర్(రామప్ప), క్రైమ్ మిర్రర్, అక్టోబర్ 09:** మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శుక్రవారం సీనినటుడు చంద్రశేఖర్( చత్రపతి శేఖర్) దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ లు ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. కాగా చత్రపతి, ఈగ, ఆర్ ఆర్ ఆర్, మగధీర, సై,సింహాద్రి, విక్రమార్కుడు, తథితర సినిమాలలో నటించారు. చత్రపతి సినిమాతో చంద్రశేఖర్ పేరు చత్రపతి శేఖర్ గా పేమస్ అయ్యారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు, అరుణ్, శ్రీకాంత్, బద్రు, శ్రీనివాస్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## లార్డ్స్ ఒలింపియాడ్ స్కూల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) బడంగ్ పేట్ లోని లార్డ్స్ ఒలింపియాడ్ స్కూల్ లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నశీటాయి. తెలంగాణా రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేస్తూ లార్డ్స్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దుర్గామాత నవరూపాలు, వారి హావ భావాలు, నృత్యం ఆద్యంతం ఆసక్తి కరంగా సాగింది. లార్డ్స్ గ్రూప్ చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాతూ ప్రపంచంలో అన్ని ప్రాంతాల్లో దేవుళ్ళకు పువ్వులతో పూజలు చేస్తే, ఒక్క మన తెలంగాణా లో మాత్రమే పువ్వులకే పూజ చేసే ఒకే ఒక్క పండగ బతుకమ్మ పండుగ అనీ, ఇంతటి విశిష్టత గల పండుగ జరుపుకుంటున్న తెలంగాణా రాష్ట్రం లోని ప్రజలందరూ సుఖ శాంతులతో జీవించాలని ఆ బతుకమ్మ ను కోరుకున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, లార్డ్స్ ఒలింపియాడ్ ప్రిన్సిపాల్ బానూరు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంస్థలు, అధికారులకు అవార్డులు




**హైదరాబాద్ : (క్రైమ్ మిర్రర్):** సమాచార హక్కు వారోత్సవాల్లో భాగంగా వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంస్థలు, అధికారులకు గవర్నర్ అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. ఉత్తమ స్వచ్ఛంద సమాచార వెల్లడి -- జిల్లా కేటగిరీ: నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్. హరీష్ అవార్డులు అందుకున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి అవార్డులు అందుకున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన శాఖ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు అవార్డు లభించగా, ఆ శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ అవార్డును స్వీకరించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన సచివాలయ శాఖ: ఆర్థిక శాఖకు అవార్డు లభించగా, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అవార్డును స్వీకరించారు.

**ఉత్తమ ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు):** ఖమ్మం కలెక్టరేట్ డీఆర్వో రామ్మూర్తి, నిజామాబాద్ మున్సిపల్



కమిషనర్ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ ఎం.ఏ. నజీర్, మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, తెలంగాణ సమాచార కమిషన్ పీఐఓ జె. రాము అవార్డులుఅందుకున్నారు.

**ప్రత్యేక కేటగిరీ:** ఉత్తమ పనితీరు కనబరిచిన సంస్థగా టీజీఆర్టీసీకి సంబంధించి వై. నాగిరెడ్డి, రామగుండం తహసీల్దార్ రవీందర్‌రావు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్‌రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్‌హర్ మహేశ్ దత్త ఏక్కా, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి వినయ్‌కుమార్, రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు, మొహ్సినా పర్వీన్, దేశాల భూపాల్, వైష్ణవి మెర్ల, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజా సమాచార అధికారులు, ప్రథమ అప్పీలేట్ అధికారులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 శనివారం 10-10-2026



## చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో రంగురంగుల పూలతో బతుకమ్మ సంబరాలు

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు రంగు రంగుల పూలతో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.పూల సొబగులు... చిన్నారుల చిరునవ్వులు బతుకమ్మ పాటల సందడితో చెల్లాపురం ప్రాథమిక పాఠశాల పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ సంబరాలు ఉత్సాహభరితంగా సాగాయి. రంగు రంగుల పూలతో ముస్తాబైన బతుకమ్మల చిన్నారులు ఆటపాటలతో ప్రత్యేక ఆకర్షణగా ప్రకృతిని ఆరాధిస్తూ సంప్రదాయాలను గౌరవిస్తూ బతుకమ్మ సంబరాలు జరుపుకున్న ఈ కుల పండుగ అందరికీ మధుర జ్ఞాపకంగా నిలిచాయి.ఈ వేడుకల్లో సర్పంచ్ శకుంతల కేశవులు,ఏఏపీసీ చైర్మన్ సంతోష వెంకటేష్,ప్రధానోపాధ్యాయులు తుప్పలి ఆనంద్ కుమార్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, దస్తయ్య,విద్యార్థుల తల్లిదండ్రులు తిరుపతమ్మ, హంసమ్మ, లక్ష్మి, సత్యమ్మ, జంగమ్మ, బాలయ్య, చందు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కుల్కచర్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో ఉన్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి అమ్మవారి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి గురువారం నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా జరుగుతున్న పనులని పరిశీలించి తనవంతుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని పోచమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్, పరిగి బ్లాక్ బి అధ్యక్షులు కర్రే భరత్ కుమార్ సూచించడం జరిగింది.ఈ కార్యక్రమం లో పిఎసిఎస్ చైర్మన్ బొలుసని భీమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైర్మన్ ఆంజనేయులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుప్పలి వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకి రెడ్డి కృష్ణ రెడ్డి, జోగు వెంకటయ్య,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, దళిత యువ శక్తి యువజన మండల సంఘం కోశాధికారి శివాని చక్కయ్య,సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సాలెటి రవికుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగని ఎల్లయ్య, ఆలయ కమిటీ సభ్యులు నాగని వెంకట్రాములు, బైండ్ల రాంచెంద్రయ్య,కామునిపల్లి వెంకటయ్య,దొమ్మ బాబు,పోతగాళ్ల చిన్న గోపాల్,పోతగాళ్ల బాలకృష్ణ,నాగని ఆంజనేయులు, శివాని వెంకటయ్య,సాలెటి చిన్నయ్య,దండు వెంకటయ్య, జెట్టిగాళ్ల వెంకటయ్య,దొమ్మ వెంకట్, తాలుకా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ.కొడుదుటి బాను,మేకుల యాదయ్య,సాలెటి అరుణ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## సల్మాన్ ఖాన్ స్మారకంగా క్రికెట్ టోర్నమెంట్..!!

### ముఖ్య అతిథిగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

### టోర్నమెంట్‌కు క్రీడాకారులు, యువత హాజరుకావాలని విజ్ఞప్తి



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలో క్రీడా సందడి నెలకొననుంది. మాజీ ఉప సర్పంచ్ స్వర్గీయ సల్మాన్ ఖాన్ స్మారకార్థం నిర్వహిస్తున్న దసరా క్రికెట్ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శనివారం (అక్టోబర్ 10) ఉదయం 10 గంటలకు మహాదేవపూర్ ప్రభుత్వ కళాశాల క్రీడా ప్రాంగణంలో టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. సల్మాన్ ఖాన్ స్మారకార్థం నిర్వహిస్తున్న ఈ క్రికెట్ టోర్నమెంట్ ద్వారా క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు యువతలో క్రీడల పట్ల ఆసక్తిని ప్రోత్సహించే అవకాశం ఉంది.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరై టోర్నమెంట్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మహాదేవపూర్ మండల ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాసరావు కోరారు.

# లక్ష్మిగూడలో రోడ్లను గుల్ల చేస్తున్న 'మైదా లారీల' దందాలు!

### రూ. 10 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### అభివృద్ధిని తుంగలో తొక్కుతూ నడిరోడ్డుపైనే లారీల అన్‌లోడింగ్

### శర్మ, శుక్ల అనే వ్యాపారుల దురుసు ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహ జ్వాలలు

### పట్టించుకోని GHMC, ఆహార భద్రతా అధికారులు.. చర్యలు కోరుతున్న కాలనీవాసులు





**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డ్ కాలనీలో కొన్నేళ్ల నిరీక్షణ తర్వాత ఇప్పుడిప్పుడే రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం లభిస్తుంటే.. కొందరు వ్యాపారుల స్వార్థం కాలనీ భవిష్యత్తును నాశనం చేస్తోంది. స్థానిక ఎమ్మెల్యే శ్రీ టి. ప్రకాష్ గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకుని దాదాపు రూ. 10 కోట్ల నిధులు మంజూరు చేయించి, కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయిస్తున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కాలనీకి మంచి భవిష్యత్తు వస్తోందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్న తరుణంలో, కొంతమంది వ్యాపారుల అక్రమ ధోరణి స్థానికులకు శాపంగా మారింది.

**నడిరోడ్డుపైనే 16 టైర్ల భారీ లారీలు:** కాలనీలోని మైదా గోడౌన్ యజమానులు శర్మ, శుక్ల అనే వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా 16 టైర్ల భారీ హెవీ వాహనాలను (షుగర్, మైదా లోడు లారీలను) కాలనీ చిన్న రోడ్లలోకి తీసుకొస్తున్నారు. గోడౌన్‌కు సరుకును చేరవేసే క్రమంలో నడిరోడ్డుపైనే గంటల తరబడి లారీలను నిలిపివేసి లోడింగ్, అన్‌లోడింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల ఎమ్మెల్యే గారు ఎంతో కష్టపడి వేయిస్తున్న కొత్త రోడ్లు, డ్రైనేజీలు ప్రారంభంలోనే ధ్వంసమయ్యే పరిస్థితి ఏర్పడింది.

**ప్రశ్నిస్తే దురుసు ప్రవర్తన -- ఏం చేసుకుంటారో చేసుకోండి!**

నడిరోడ్డుపై లారీలు ఆపి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని, కొత్తగా నిర్మిస్తున్న రోడ్లు పాడవుతున్నాయని కాలనీవాసులు ప్రశ్నిస్తే సదరు వ్యాపారులు అత్యంత దురుసుగా ప్రవర్తిస్తున్నారు. "ఇది మా ఇల్లు, మా ఇష్టం.. మేం ప్రాపర్టీలు కొనుక్కున్నది ఇందుకే! మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తూ బెదిరింపులకు దిగుతున్నారు.

**నిబంధనలు తుంగలో.. అధికారుల నిర్లక్ష్యం:**

సాధారణంగా నివాస ప్రాంతాలలో (Residential Areas) ఆహార పదార్థాల గోడౌన్లు ఏర్పాటు చేయడానికి, పరిశ్రమల స్థాయి భారీ వాహనాలు తిరగడానికి స్పష్టమైన నిబంధనలు ఉంటాయి. కానీ ఇవేమీ పట్టించుకోకుండా శర్మ, శుక్ల అనే వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. ఈ విషయమై జిహెచ్ఎంసి (GHMC) అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

**ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం:** ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గారు కాలనీ అభివృద్ధికి రూ. 10 కోట్లు కేటాయిస్తే, కొందరు వ్యాపారుల ఆగడాల వల్ల ఆ అభివృద్ధి బూడిదలో పోసిన పన్నీరులా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఆ లారీల రాకపోకలను నిలిపివేసి, నిబంధనలు ఉల్లంఘించిన గోడౌన్ పై కఠిన చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గారి దృష్టికి మరియు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి కాలనీ తరఫున పెద్ద ఎత్తున పోరాడతామని స్థానిక నివాసితులు హెచ్చరిస్తున్నారు.

# కూకట్‌పల్లిలో యువతి అనుమానాస్పద మృతి.. ప్రేమ వ్యవహారమే కారణమా?

### హాస్టల్ గదిలో ఉరివేసుకున్న స్థితిలో యువతి మృతదేహం

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**కూకట్‌పల్లి, అక్టోబర్ 09 (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి గృహ సముదాయాల ప్రాంతంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఉపాధి కోసం నగరానికి వచ్చిన 22 ఏళ్ల యువతి హాస్టల్ గదిలో ఉరివేసుకున్న స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. విశాఖపట్నం జిల్లా తాటిచెట్లపాలెం మండలం చిట్టిబాబు కాలనీకి చెందిన తోట ధనలక్ష్మి (22) ఈ ఘటనలో మృతి చెందింది. ఆమె తండ్రి తోట రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి గృహ సముదాయాల ప్రాంత పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండు నెలల క్రితమే హైదరాబాద్‌కు రాక: ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. తోట ధనలక్ష్మి రెండు నెలల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చింది. కూకట్‌పల్లి గృహ సముదాయాల ప్రాంతంలోని మొదటి రహదారిలో ఉన్న ఆర్.కె. వసతి గృహంలో ఉంటూ, సమీపంలోని డొమినోస్ పిజ్జా సంస్థలో పనిచేస్తోంది. ఆమె తన తండ్రితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండేది. ఈ క్రమంలో అక్టోబర్ 8వ తేదీ సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో వసతి గృహ నిర్వాహకుడు శంకర్ ఫోన్ చేసి, ధనలక్ష్మి తన గదిలో ఉరివేసుకుని మృతి చెందినట్లు తండ్రికి సమాచారం అందించారు. పూర్తి వివరాల ప్రకారం గది తలుపులు పగలగొట్టి చూడగా..: కుమార్తె మరణవార్త తెలిసిన వెంటనే తోట రమణ హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకునే క్రమంలో ధనలక్ష్మితో కలిసి ఒకే గదిలో ఉంటున్న మహిళను విచారించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. ధనలక్ష్మి గత నాలుగేళ్లుగా చింటూ అనే వ్యక్తితో ప్రేమలో ఉంది. ఘటన జరిగిన రోజున అతనితో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం ధనలక్ష్మి తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. ఆ సమయంలో జ్యోతి తన కార్యాలయంలో ఉండగా, చింటూ ఫోన్ చేసి ఈ విషయాన్ని ఆమెకు తెలియజేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని వసతి గృహ నిర్వాహకుడు శంకర్‌కు తెలియజేయడంతో, ఆయన అదే రోజు సాయంత్రం సుమారు 4.30 గంటలకు ధనలక్ష్మి గది వద్దకు వెళ్లి తలుపులు తట్టారు. అయినప్పటికీ లోపలి నుంచి స్పందన రాకపోవడంతో కిటికీలోంచి చూడగా, ఆమె పైకప్పు ఫ్యాన్‌కు చున్నీతో వేలాడుతూ కనిపించింది. వెంటనే స్థానికుల సహాయంతో గది తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లారు. సమాచారం అందుకున్న 108 అత్యవసర వైద్య సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించగా, అప్పటికే ధనలక్ష్మి మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రేమ వ్యవహారంపై తండ్రి అనుమానం: తన కుమార్తె చింటూ అనే వ్యక్తితో ప్రేమలో ఉందని, వారి మధ్య ఏవైనా గొడవలు, విభేదాలు లేదా ఇతర సమస్యలు తలెత్తి ఉండవచ్చని, వాటి కారణంగా ఆమె మనస్తాపానికి గురై ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని తండ్రి తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. అయితే, కుమార్తె మరణానికి గల అసలు కారణాలు తనకు తెలియవని స్పష్టం చేశారు. ఈ ఘటన వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసి, సమగ్ర విచారణ జరిపి, బాధ్యులెవరైనా ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. పోలీసుల దర్యాప్తు: తండ్రి ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి గృహ సముదాయాల ప్రాంత పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువతి మరణానికి దారితీసిన పరిస్థితులపై పోలీసులు విచారణ చేపట్టగా, పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది. ప్రేమ వ్యవహారమే మరణానికి కారణమని ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు. దర్యాప్తు అధికారి ఎస్.ఐ.పి. శ్రీమతి వి. మౌనిక రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తదుపరి చర్యలు చేపడుతున్నారు.

# శ్రీ చైతన్య హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

క్రైమ్ మిర్రర్ షాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం లోని నాగర్‌గూడలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో బతుకమ్మ వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు పండుగ వాతావరణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ పండుగకు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందని, ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే ఈ పండుగ మహిళల ఐక్యతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా వివరించారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను తెలియజేయడం ద్వారా వాటిని భావితరాలకు అందించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడంతో పాఠశాల ఆవరణలో పండుగ సందడి నెలకొంది. సంప్రదాయ పండుగలను విద్యాసంస్థల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సాంస్కృతిక అవగాహనతో పాటు మన సంప్రదాయాల పట్ల గౌరవభావం పెంపొందుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.



తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.

# బిహెచ్‌ఈఎల్ డిపోలో టి.ఆర్.డబ్ల్యూ.యు 174 ఓట్ల తో ముందంజ

### విజయోత్సవ ర్యాలీ నిర్వహించిన ఆర్టీసీ కార్మికులు



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 09: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఆర్టీసీ కార్మిక సంఘం ఎన్నికల్లో బిహెచ్‌ఈఎల్ డిపోలో తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టి.ఆర్.డబ్ల్యూ.యు) ముందంజలో నిలిచింది. మొత్తం 325 ఓట్లకు గాను 289 ఓట్లు పోలయ్యాయి. తొమ్మిది మంది అభ్యర్థులు పోటీపడిన ఈ ఎన్నికల్లో ప్రధానంగా మూడు సంఘాల మధ్య పోటీ నెలకొంది. బిహెచ్‌ఈఎల్ డిపోలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది. సాధారణ ఎన్నికలను తలపించేలా పోలింగ్ నిర్వహించగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రామచంద్రాపురం ఎసిపి శ్రీనివాస్ కుమార్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. బిహెచ్‌ఈఎల్ డిపోలో జరిగిన ఎన్నికల్లో బాణం గుర్తుతో పోటీ చేసిన టి.ఆర్.డబ్ల్యూ.యు కు 174 ఓట్లు వచ్చాయి.గద గుర్తుతో పోటీ చేసిన టీజేఎంయూకు 72 ఓట్లు, టీఎస్‌ఆర్టీసీ యూనియన్‌కు 40 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారి మహమ్మద్ అబ్జల్ పాషా తెలిపారు. రాష్ట్రస్థాయిలోనూ టి.ఆర్.డబ్ల్యూ.యు కు ఆధిక్యం లభించినట్లు ఆ సంఘం వర్గాలు తెలిపాయి. ఎన్నికల్లో ఆధిక్యం నేపథ్యంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పుష్ప నాగేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.